అనకర్లపూడి పూర్వపు పీఎస్‌పై వేటు

- సస్పెండ్ చేస్తూ పీఆర్ కమిషనర్ ఉత్తర్వులు
- జగనన్న లే అవుట్‌లో అక్రమంగా ప్రార్థనా మందిర నిర్మాణం
- అధికారం లేకపోయినా తప్పుడు తీర్మానం ఇచ్చిన కార్యదర్శి
- అధికారుల నివేదికల ఆధారంగా చర్యలు

కొండపి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనకర్లపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి, గత నెలలో పొన్నలూరు ఈవోఆర్డీగా ఉద్యోగోన్నతి పొందిన పి.సాంబయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ డీపీవోకు ఉత్తర్వులు పంపారు. వివరాల్లోకి వెళితే.. 2020లో అకనర్లపూడిలోని 173, 174 సర్వే నంబర్లలో 70 సెంట్ల వాగుపోరంబోకు భూమిని కన్వర్షన్ చేసి జగనన్న లేఅవుట్‌గా మార్చారు. మొత్తం 68 ప్లాట్లలో 60 పట్టాలు గ్రామానికి చెందిన వారికి ఇవ్వగా, 6 ముప్పరాజుపాలెం గ్రామస్థులకు కేటాయించారు. రెండు పట్టాలు కమ్యూనిటీ అసరాల కోసం ఖాళీగా ఉంచారు. గ్రామానికి చెందిన తన్నీరు నరసింహం అనే వ్యక్తి ముప్పరాజుపాలెం గ్రామస్థులకిచ్చిన ఆరు పట్టాలతోపాటు కమ్యూనిటీ అవసరాల కోసం వదిలిన రెండు పట్టాలు కలిపి మొత్తం 12 సెంట్లలో భారీ నిర్మాణం ప్రారంభించారు. ఇళ్లస్థలాల లబ్ధిదారులు తమ ప్లాట్లలో నిర్మాణం ఏమిటని ప్రశ్నించగా పట్టించుకోకుండా నరసింహం పనులు కొనసాగించారు.

కోర్టుకెక్కిన వ్యవహారం

నిర్మాణం ఆపాలని అనకర్లపూడి గ్రామానికి చెందిన వేముల శ్రీనివాసరావు కోర్టుకు వెళ్లారు. దీనిపై కోర్టు ఆదేశాల మేరకు వివిధ స్థాయిల్లో రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు పలు దఫాలుగా పరిశీలన చేసి నివేదికలు ఇచ్చారు. అక్రమ కట్టడానికి అనుమతులు లేవని పలువురు క్షేత్రస్థాయి అధికారులు తమ శాఖ ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. ఇదేసమయంలో అప్పటి అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు గ్రామసభ ద్వారా తీర్మానం చేసి ప్రార్థనా మందిరం నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి సాంబయ్య అనుమతిచ్చారు. అసలు ఆ అధికారం పంచాయతీ కార్యదర్శికి లేదనే విషయాన్ని అధికారులు పేర్కొంటూ సాంబయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఉద్యోగోన్నతి పొందిన కొద్ది రోజులకే..

గడచిన నెలలో ఈవోఆర్డీగా ఉద్యోగోన్నతి పొందిన సాంబయ్య పొన్నలూరు మండలంలో విధుల్లో చేరిన పది రోజులకే సస్పెండ్ కావడం ఆశాఖలో చర్చనీయాంశమైంది. కోర్టు కేసు విషయంలోనే ఇప్పటికే కొండపి గ్రామ పంచాయతీ కార్యదర్శి బిళ్లా అంకయ్య సస్పెండ్ అయ్యారు. ఇప్పుడు అనకర్లపూడి పూర్వపు పీఎస్‌పై చర్యలు తీసుకున్నారు. గడచిన ప్రభుత్వంలో అప్పటి అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా అడ్డగోలుగా పనిచేసిన క్షేత్రస్థాయి సిబ్బంది ఒక్కొక్కరిపై వేటు పడుతుండటం చర్చనీయాంశమైంది.

బేరసారాలు

అవినీతి ఆర్పీల్లో మొదలైన వణుకు

- మెప్మాలో వరుస విచారణలతో మల్లగుల్లాలు
- ఎలాగోలా తప్పించుకునేందుకు కుయుక్తులు
- సీవోల, అధికారుల కొందరు చుట్టూ ప్రదక్షిణలు





పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పేరుకుపోయిన అవినీతిపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురిస్తున్న వరుస కథనాలతో ఆ శాఖలో కలవరం మొదలైంది. పేద మహిళల పేరుతో రూ.కోట్లు దండుకుని దర్జాగా తిరుగుతున్న కొందరు ఆర్పీలు అవినీతి నుంచి బయటపడే మార్గం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. బ్యాంకు అధికారులతో కుమ్మక్కై దోచుకున్న ఆర్పీలు మాత్రం తమ పంథా వీడటం లేదు. ఎస్టీ మహిళలను మోసం చేసి భారీగా మెక్కేసిన ఓ ఆర్పీ... తనకు సహకరిస్తున్న ముగ్గురు సీవోలు, అధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. ఈ సమస్య నుంచి తను బయటపడే మార్గం చూపాలని బేరసారాలకు దిగినట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఇప్పుడు పెద్దలకు వరంగా.. పేదలకు శాపంగా మారింది. ప్రత్యేకించి పొదుపు సభ్యురాలిగా ఉంటే ప్రభుత్వం అందించే రుణాల ద్వారా ఆర్థికతోడ్పాటు లభిస్తుందన్న ఆశ పట్టణ మహిళల్లో అధికంగా ఉంది. దీంతో అత్యధిక శాతం మంది మహిళలు పొదుపు సభ్యులుగా చేరుతున్నారు. అయితే వారి అవసరాలను కొందరు ఆర్పీలు అవకాశంగా మార్చుకుని బోగస్ గ్రూపులు దోచేస్తుండగా, మరికొందరు రుణాలు తీసుకుని సకాలంలో చెల్లిస్తూ జాగ్రత్తపడుతున్నట్లు సమాచారం. కొద్ది రోజులుగా ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు రావడంతో అవినీతి ఆర్పీల్లో వణికిపోతున్నారు. అందుకు సహకరించిన ఉద్యోగుల్లోనూ కలవరం మొదలైంది. అయితే బోగస్ గ్రూపులతో భారీగా నగదు దోచుకున్న వ్యవహారంలో కేవలం ఆర్పీలే కాకుండా సీవోలు, సీఎంఎంలు, ఇతర సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని కొందరు ఆర్పీలు బహిరంగంగానే వెల్లడిస్తున్నారు. బోగస్ రుణాలలో తమను బాధ్యులుగా చేస్తే అందులో భాగస్వాములైన మిగతావారిని కూడా బయటకు లాగుతామని బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో బ్యాంకర్లతోపాటు సీవోలు, సీఎంఎంలు, బ్యాంకు లింకేజి అధికారులు, ఇతర సిబ్బంది ఉలికిపాటుకు గురవుతున్నారు.

అవినీతిలో ఎవరున్నా క్షమించేది లేదు

మెప్మాలో చోటుచేసుకున్న బోగస్ గ్రూపుల వ్యవహారంపై కలెక్టర్ ఆదేశాలతో జాయింట్ కలెక్టర్ విచారణ చేపట్టారు. పొదుపు సభ్యులకు అందిస్తున్న రుణాలు, బ్యాంకుల ద్వారా పొందిన రుణాల నివేదికలను ఎల్‌డీఎం ద్వారా తెప్పించారు. జేసీ విచారణ కమిటీ కోరిన రికార్డులు వారికి అందిస్తున్నారు. మెప్మా ఎండీ ఆఫీసు నుంచి విచారణ కమిటీ ఒంగోలు విచ్చేసి విచారణ చేసింది. తిరిగి వచ్చే వారం మరోసారి వచ్చి విచారిస్తారు. వారితోపాటు నేను కూడా అంతర్గతంగా విచారణ చేస్తున్నా. ఇప్పటికే ఎమ్మెల్యే జనార్దన్ మెప్మాపై సీరియస్‌గా దృష్టి సారించారు. బాధితులకు న్యాయం చేయడం కోసం అవసరమైన చర్యలు చేపట్టాం. విచారణ పూర్తయిన తర్వాత అందులో ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించేది లేదు.

- పి. శ్రీహరి, మెప్మా పీడీ

సాగునీటి పరిమాణాన్ని పెంచాలి

- ఇరిగేషన్ అధికారులకు సీఈ ఆదేశం
- వెంటనే కొంత పెరుగుదల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దర్శి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు సాగర్ జలాల పరిమాణాన్ని పెంచాలని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. 'సాగునీటి పంపిణీ అస్తవ్యస్తం' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. జిల్లాకు తక్కువగా నీరు విడుదలవుతున్న విషయమై సీఈ శ్యామ్‌ప్రసాద్.. లింగంగుంట్ల ఎస్ఈ వెంకటరత్నం, ఒంగోలు ఎస్ఈ వరలక్ష్మిలతో మాట్లాడారు. జిల్లాకు నీటి పరిమాణాన్ని పెంచాల్సిన అవసరం ఉందని ఎస్ఈ వరలక్ష్మి తెలిపారు. దీంతో సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు (ప్రకాశం సరిహద్దు) వద్ద 2,600 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని పల్నాడు జిల్లా లింగంగుంట్ల ఎస్ఈ వెంకటరత్నంను ఆదేశించారు. ఆ ఉత్తర్వుల మేరకు ఇప్పటికే జిల్లాకు కొంత నీటి పరిమాణం పెంచారు. ప్రస్తుతం సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు వద్ద 2,312 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. అది సోమవారానికి మరింత పెరిగి 2,500 క్యూసెక్కులకు చేరుతుందని అధికారులు తెలిపారు.

నేడు ఒంగోలులో మీ కోసం

డయల్1100ను వినియోగించుకోవాలని

కలెక్టర్ రాజాబాబు విజ్ఞప్తి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) సోమవారం ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో అర్జీలు ఇచ్చినవారు అందుకు సంబంధించిన స్లిప్పులను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, అర్జీదారులు దాన్ని కూడా చెక్ చేసుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు కారణాలు, వాటికి సంబంధించిన సమాచారాన్ని 1100 నంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

పురాతన దేవాలయాలకు మహర్దశ

మంత్రి స్వామి చొరవతో రూ.4.23 కోట్లు మంజూరు

7

ఆయన రూటే సపరేటు

లంచాలు వదిలేసి వాటాలు

సమస్యలపై కార్యాలయానికి వెళ్లే వారితో బేరాలు

రూ.లక్షపైన వస్తాయనుకుంటే వెంటనే రంగంలోకి..

కొత్త జిల్లా ఏర్పడనుండటంతో మరింత చేతివాటం

మార్కాపురంలో ఓ రెవెన్యూ అధికారి తీరు ఇదీ



మార్కాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో ఓ రెవెన్యూ అధికారి రెచ్చిపోతున్నారు. అవినీతిలో ఆరితేరిన ఆయన భూసమస్యలను ఆసరా చేసుకొని అందినకాడికి దండుకుంటున్నారు. వివాదంలో ఉన్న భూముల మార్కెట్ ధరలో వాటా అడుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. కనీసం రూ.లక్ష వస్తాయనుకుంటేనే భూసమస్యలు వింటున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాస్థాయి అధికారులతో సత్సంబంధాలు, అధికార పార్టీ నాయకుల ఆశీస్సులు పుష్కలంగా ఉండటంతోనే ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు.

కార్యాలయంలోనే బేరం

ప్రస్తుతం మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో గతంలో ఎకరా రూ.కోటి అమ్మని భూమి నేడు రూ.4కోట్లు పలుకుతోంది. దీంతో పలు రకాల భూసమస్యలపై రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లేవారి సంఖ్య పెరిగింది. దీన్ని ఆసరా చేసుకొని కీలకమైన సదరు రెవెన్యూ అధికారి తన ప్రతాపం చూపడం ప్రారంభించారు. పక్క జిల్లాకు చెందిన ఓ వ్యక్తి నరసింహాపురం ఇలాకాలో సుమారు 4 ఎకరాల మేర భూమిని సంవత్సరం క్రితం కొన్నాడు. అన్ని రికార్డులూ పక్కాగానే ఉన్నాయి. ఆన్‌లైన్ మాత్రమే కాలేదు. ఆన్‌లైన్ చేయమని దరఖాస్తు చేసుకుంటే నేరుగా కార్యాలయానికి ఆ వ్యక్తిని అధికారి పిలిపించుకున్నారు. బేరం మొదలుపెట్టి పెద్దమొత్తంలో డిమాండ్ చేశారు. లంచంలా కాకుండా మొత్తం ఆస్తిలో వాటా అడగడంతో అతనికి కళ్లు బైర్లు కమ్మాయి. ఓ కుటుంబ సభ్యుల ఆస్తి తగాదా విషయంలో కూడా ఒకవైపు వాళ్లదగ్గర పెద్దమొత్తంలో లంచం తీసుకుని అడ్డగోలుగా వ్యవహరించినట్లు సమాచారం. ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినా తనకున్న పరిచయాలతో తప్పించుకుంటున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రేమ.. మోసం..

- జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య
- ఒంగోలులో యువతి, దర్శి మండలంలో బాలిక



ఒకరు ఎంటెక్ పూర్తి చేసిన యువతి. మరొకరు ఇంటర్మీడియట్ చదివే బాలిక. ప్రేమించిన యువకులు మోసం చేయడంతో ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు.

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. వీరిలో యువతి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడితో ప్రేమలో పడింది. అతను 12 ఏళ్లుగా ఆమె చుట్టూ తిరిగాడు. పెళ్లి ప్రస్తావన తెచ్చే సరికి కులం పేరు చెప్పి కుదరదన్నాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆ యువతి ఇంట్లోనే ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన ఒంగోలులో ఆదివారం చోటుచేసుకుంది. దర్శి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (16) ఇంటర్మీడియట్ చదువుతోంది. స్వగ్రామానికి చెందిన యువకుడిని ప్రేమించి మోసపోయింది. ఎలుకల మందు తాగింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వారం క్రితం చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

7

వీవోఏ రూ.28 లక్షలు స్వాహా చేసిందని ఫిర్యాదు

కేసు నమోదు చేయాలని మంత్రి స్వామి ఆదేశం

7



కుప్పకూలిన కారుమంచి మేజర్ కాలువ కట్ట(ఫైల్)

కారుమంచి మేజర్‌కు మంచిరోజులు

- కూలిన కట్ట పునరుద్ధరణకు లైన్‌క్లియర్
- డిజైన్ కోసం ప్రతిపాదనలు పంపాలని సీఈ ఆదేశం
- సాయిల్ టెస్ట్ చేయించి ఫలితం కోసం వేచి చూస్తున్న అధికారులు
- వేసవిలో పనులు మొదలు పెట్టడానికి వీలుగా కసరత్తు
- ఫలించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్, ఎన్ఆర్ఐ శేషయ్యల కృషి

7

వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ సులభతరం

- కేవలం రూ.100తోనే చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు
- వేలాది కుటుంబాలకు ఊరట
- అటువంటి వాటిపై జిల్లాలో ఇప్పటికే నాలుగువేలకుపైగా వినతులు



ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వారసత్వ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌ను ప్రజా ప్రభుత్వం సులభతరం చేసింది. కుటుంబ సభ్యుల భాగపంపిణీ ఒప్పందాల రిజిస్ట్రేషన్ ఫీజుల విషయంలో మార్పులు తెచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిర్ధారించిన మార్కెట్ విలువ ప్రకారం ఆస్తి ధర రూ.10లక్షల లోపు ఉంటే రూ.100, ఆపైన ఉంటే రూ.వెయ్యి ఫీజును స్టాంపు డ్యూటీ కింద చెల్లించాల్సి ఉంటుంది. యజమానులు మరణించిన అనంతరం వారసులకు సంక్రమించే వ్యవసాయ భూములకు మాత్రమే ఈ ఫీజులు వర్తిస్తాయని ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది.

వైసీపీ హయాంలో బాదుడు.. ఇప్పుడు విముక్తి

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత వైసీపీ హయాంలో విధించిన భూబాదుడు నుంచి విముక్తి కల్పించింది. వైసీపీ హయాంలో భాగపంపిణీ ఆస్తుల రిజిస్ట్రేషన్ ఫీజు అధికంగా ఉండటంతో చిన్న, సన్నకారు రైతులపై భారం పడింది. దీంతో చాలా మంది రిజిస్ట్రేషన్‌లకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. రైతులు తెల్లకాగితాలపై ఒప్పందాలకే పరిమితమయ్యారు. వీటికి మ్యుటేషన్లు జరక్కపోవడంతో వేలాది కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయి. గత ఏడాది కాలంలో జిల్లాలో అటువంటి ఫిర్యాదులు సుమారు నాలుగువేలకు పైగా వచ్చాయి. వాటిని జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఇలాంటి పరిస్థితే ఉంది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధిత అధికారులతో ఈ విషయమై చర్చించారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదనుగుణంగా వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూములను తక్కువ ధరకే రిజిస్ట్రేషన్ చేసేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో జిల్లాలోని వేలాది మందికి ఊరట లభించనుంది. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ పూర్తయితే వారికి ఆటోమ్యుటేషన్‌తోపాటు పట్టాదారుపాసుపుస్తకాలతో పూర్తి హక్కులు సక్రమించనున్నాయి.

ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యే విజయకుమార్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్.విజయకుమార్‌ను బీజేపీ నాయకులు సన్మానించారు. స్థానిక మంగమూరు రోడ్డులోని బీఎన్ కార్యాలయంలో ఆదివారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దండు శ్రీనివాసరావు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. నియోజకవర్గంలో రానున్న రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ, ప్రజా సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు కావూరి వాసు, గుండా శ్రీనివాస్, కళ్యాణ్‌రెడ్డి, ప్రసాద్, కొప్పూరు సతీష్, దండే సాయి, అమరసింహ, అజయ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

గుడి పునఃనిర్మాణానికి నిధుల మంజూరుపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

సింగరాయకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలగుంటపాడు పోలేరమ్మగుడి పునఃనిర్మాణానికి దేవదాయశాఖ నుంచి రూ.50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. దీంతో గ్రామస్థులు ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిధులు మంజూరుకు సహకరించిన మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

నూతన వైద్యవిధానంపై అవగాహన అవసరం



డాక్టర్ నరేంద్రబాబును సత్కరిస్తున్న వైద్యాధికారులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైద్యవిధానంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలని అరవింద సూపర్ స్పెషాలిటీ వైద్యుడు మందలపు నరేంద్రబాబు, డాక్టర్ భానుతేజ పేర్కొన్నారు. ఒంగోలులోని కేబీ సమావేశపు హాలులో ఆదివారం సీఎంఈ ద్వితీయ సమావేశం జరిగింది. ఒలంపస్, అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ సహకారంతో ఈ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్ట్రబుల్ సమస్య అధికంగా వస్తుందని, అది అనేక రూపాలలో కనిపిస్తోందన్నారు. అందుకోసం ఎండోస్కోపి, కొలనోస్కోపి, బ్రాంకో స్కోపి ద్వారా కనిపిస్తుందన్నారు. వైద్య విధానంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావునాయుడు, డాక్టర్ హరిబాబు, హైకోర్టు న్యాయవాది ఏడుకొండలు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

కాకినాడలో రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కాకినాడులోని జేఎన్‌టీయూలో ఈనెల 21నుంచి 23వతేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు జేవీవీ నాయకుడు ఏవీ.పుల్లారావు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఈమేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఏర్పడిన జేవీవీ గత 35 ఏళ్ళుగా తెలుగు విద్యార్థుల కోసం ప్రతిఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.జయప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించిన టీంలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు యు.వెంకట్రావు, జి.శ్రీనివాసరెడ్డి, వి.మాలకొండారెడ్డి, కె.సుబ్రహ్మణ్యం, ఎస్‌వీ.రంగారెడ్డి, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి



యువకుడి మృతదేహం

ఒంగోలు క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన సంఘటన ఒంగోలు రైల్వేస్టేషన్ ఉత్తరం వైపున ఆదివారం జరిగింది. సంఘటన స్థలాన్ని రైల్వే ఎస్సై మధుసూదన్ సందర్శించారు. సుమారు 25-30 ఏళ్ళ మధ్య వయస్సు గల యువకుడు ముదురు పచ్చరంగు నిండు చేతుల టీ షర్టు, లైటు సిమెంట్ కలర్ జీన్స్ ప్యాంట్‌చ క్లాత్ బెల్ట్ ధరించి ఉన్నాడు. ఎడమ వైపు భుజంపై , ఎడమ వైపు రొమ్ము పై పుట్టుమచ్చ ఉందని తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని, సమాచారం తెలిసినవారు 9440627647 సెల్ నంబరును సంప్రదించాలని అయన కోరారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో నాగూర్‌వలి

మర్రిపూడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి వసతి గృహాల సిబ్బంది, అధికారులు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో నాగూర్‌వలి కోరారు. శనివారం రాత్రి కాకర్ల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల పట్ల ప్రేమాభిమానాలను చూపించాలని హితవు పలికారు. ప్రభుత్వం నిర్ధేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని కోరారు. మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

● ఎమ్మెల్యే దామచర్ల



నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(రూరల్), డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సంక్షేమానికి, వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో నౌకాదళ దినోత్సవం మాజీ సైనికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ సైనికుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని చెప్పారు. మాజీ సైనికుల విజ్ఞప్తుల మేరకు వీర జవాన్ విజయస్థూపం, మాజీ సైనికుల సంక్షేమభవన నిర్మాణం కోసం స్థానిక దక్షిణ బైపాస్‌రోడ్డులో ఏర్పాటు చేస్తామని తెలిపారు. నగర కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సైనికుల త్యాగాలను ఎలకట్టలేమన్నారు. నౌకాదళం దేశ రక్షణ వ్యవస్థలో ఎంతో కీలకమైనదని చెప్పారు. పాకిస్తాన్‌పై జరిగిన యుద్ధంలో భారత నౌకాదళం పోరాట పటిమను మర్చిపోలేమని చెప్పారు. రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘం చైర్మన్ నెప్పలి నాగేశ్వరరావు మాట్లాడుతూ సైనికులు దేశ రక్షణలో నిమగ్నమై తిరిగి ఇంటికి వస్తామనే నమ్మకం ఉండదన్నారు. త్రివిధ దళాలలో నౌకాదళానికి ప్రత్యేకత ఉందని చెప్పారు. సమాజ సేవలో మాజీ సైనికులు ముందు వరుసలో ఉంటారని తెలిపారు. దేశరక్షణతో పాటు సమాజసేవ కూడా క్రమశిక్షణతో చేపడతామని స్పష్టం చేశారు. ముందుగా వీరజవానుల విజయస్థూపం వద్ద మాజీ సైనికులు ఘనంగా నివాళలర్పించారు. విపత్తుల సమయంలో సేవలు అందించిన నెప్పలి నాగేశ్వరరావుకు మాజీ సైనిక సంక్షేమశాఖ వారు ఇచ్చిన అవార్డును, ప్రశంసాపత్రం అందజేసి శాలువాతో ఎమ్మెల్యే దామచర్ల ఘనంగా సన్మానించారు. కార్యక్రమాలలో విపత్తుల నిర్వహణ సంస్థ డైరక్టర్ పీఎస్.రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి అబ్దుల్‌రహీమ్, సంఘ నాయకులు ఆలపాటి వెంకటేశ్వరరావు, పాశం వెంకటరెడ్డి, తుళ్లూరి వెంకటేశ్వర్లు, కటారి బ్రహ్మయ్య, చుండూరి శ్రీరామూర్తి, గుమ్మడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. కాగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి.

గ్రామ సర్వేయర్ల సమస్యలను పరిష్కరించాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాళం వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక సర్వే ఉద్యోగుల సంఘం భవనంలో ఆదివారం జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల్లో రీ సర్వే చేస్తున్న గ్రామ సర్వేయర్లకు ఇతర పనులు అప్పగించకుండా చూడాలన్నారు. సర్వేయర్లకు రావాల్సిన మెడికల్ బిల్లులు సకాలంలో చెల్లించాలని చెప్పారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సంఘ భవన నిర్మాణానికి సభ్యులు నిధులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వై.బాబురావు, కోశాధికారి పరిశుద్ధరావు, ఒంగోలు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కాటంరాజు, సుశీలరావు, జిల్లాలోని అన్ని డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

11న సింగరాయకొండ ఉపసర్పంచ్ ఎన్నిక

● నోటీసు జారీ చేసిన ఎంపీడీవో



సింగరాయకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నికను ఈ నెల 11వ తేదీన అధికారులు నిర్వహించనున్నారు. ఈమేరకు ఎంపీడీవో డి.జయమణి పంచాయతీ సర్పంచ్, వార్డుసభ్యులకు నోటీసులు జారీ చేశారు. షేక్ కరీమున్ గత పంచాయతీ ఎన్నికల్లో సింగరాయకొండ పంచాయతీ 11 వార్డు సభ్యురాలిగా వైసీపీ మద్దతుతో గెలుపొందారు. ఆ తరువాత ఆమెను వార్డు సభ్యులు ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఆమె మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడతూ ఉండటంతో ఏడాది కిందట ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామాను ఎంపీడీవోకి అందజేశారు. అధికారులు ఆమె రాజీనామాను వెంటనే ఆమోదించకుండా కొన్ని నెలలు ఆపారు. ఆమె అధికారులపై ఒత్తిడి తీసుకొనిచ్చి తన రాజీనామాను ఆమోదించుకున్నారు. ఈతరుణంలో ఎన్నికల సంఘం నోటిఫికేషన్ మేరకు ఉపసర్పంచ్ ఎన్నిక అనివార్యమైంది. పంచాయతీలో మొత్తం 18 వార్డులు ఉండగా అందులో 12 మంది వార్డు సభ్యులు కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ఉంటున్నారు. దీంతో కూటమి పార్టీ నేతలు ఏకగ్రీవంగా సూచించిన వార్డు సభ్యుడు ఉపసర్పంచ్‌గా ఎన్నిక కానున్నారు.

ఫాసిస్ట్ విధానాలను వ్యతిరేకించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఒంగోలులోని స్థానిక సుందరయ్యభవన్‌లో ఆదివారం జరిగిన సీపీఎం జిల్లాస్థాయి శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హిందూత్వ ముసుగులో బీజేపీ ఫాసిస్ట్ విధానాలను అమలు చేస్తూ దేశాన్ని ప్రమాదకర దిశగా నడుపుతుందన్నారు. ఈవిధానాలను వామపక్ష శక్తులన్నీ ఎదుర్కొవాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడమే లక్ష్యమైపోయిందని ఆరోపించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచ యువత సోషలిజం వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు, కార్యదర్శివర్గ సభ్యులు జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, డి.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి పొంగళ్లు



అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజకు తరలివస్తున్న భక్తులు

మద్దిపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నందిపాడు గ్రామంలో పోలేరమ్మ తల్లికి నెలపొంగళ్ల సమర్పణ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భజన, అన్నసంతర్పణ జరిగాయి.

అలరించిన సుస్వరాభిషేకం



విభావరిలో పాల్గొన్న గాయకులు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ ఘంటసాల కళా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సుస్వరాభిషేకం పేరుతో ఏర్పాటుచేసిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి కళాకారులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు యు.కోటేశ్వరరావు నిర్వహణలో గాయకులు లక్ష్మీతులసి, సుహాసిని, ఉషారాణి, కోటేశ్వరరావు, పురాణం సుబ్రహ్మణ్యం, అక్బర్, మనోహర్, శివప్రసాద్, నాయక్, నారాయణ రావు తదితరులు పలు గీతాలను రసరమ్యంగా ఆలపించి కరతాళధ్వనులందుకున్నారు. గుర్రం కృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించిన కార్యక్రమంలో ఎన్నూరి నాగేశ్వరరావు, పొన్నూరి శ్రీనివాసులు, పెండ్యాల సాయిమాస్టర్, ఖాదర్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

సంతనూతలపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి పర్యవేక్షణ చేయాలని డీపీవో వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆదివారం సంతనూతలపాడులోని చెత్తసంపద కేంద్రం వద్ద తడి, పొడి చెత్తను వేరు చేస్తున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో మురుగుకాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లించాలని, రాత్రివేళల్లో ఫాగింగ్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రతాప్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన డీఎంహెచ్‌వో

ముండ్లమూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) ఆదివారం డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పుల వల్ల జలుబు, దగ్గు, జ్వరాలు వస్తుంటాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట వైద్యాధికారి జాస్మిన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం గుంటూరు రోడ్డులోని లారీలకుంటలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ ఎకనామికల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు నిత్యావసర వస్తువులను స్థానిక సొసైటీ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. బిహార్‌కు చెందిన షేక్ దిల్షాద్ అనారోగ్యం బారిన పడి రిమ్స్‌లో చికిత్స పొందుతుండటంతో ఆయన కుటుంబ సభ్యులు పూటగడవక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సొసైటీ ప్రతినిధులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు పఠాన్ హనీఫ్‌ఖాన్, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ షారుక్, కార్యదర్శి ఆయూబ్, నగర అధ్యక్షుడు బాజీ, కోశాధికారి గౌస్‌బాషా, మండల ఉపాధ్యక్షుడు రఫీ, దాత వహీద్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

పీసీపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగమ్మగుడి వద్ద శనివారం రాత్రి జరిగిన దొంగతనం కలకలం రేపింది. డాలి ప్యాకెట్లు కావాలని అడిగి వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును ఇద్దరు గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లిన ఘటన గత శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళాపురం గ్రామానికి చెందిన బోయిన వెంకటసుబ్బయ్య, ఆదిలక్ష్మమ్మ దంపతులు కొన్నేళ్లుగా గంగమ్మగుడి ఎదురుగా బడ్డీకొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి డాలి ప్యాకెట్ కావాలని అడిగారు. ఆదిలక్ష్మమ్మ ప్యాకెట్ అందిస్తున్న సమయంలో ఆమె మెడలో ఉన్న నాలుగు సవర్ల బంగారు గొలుసును దుండగులు ఒక్కసారిగా లాక్కొని వాహనంపై పరారయ్యారు. దీంతో షాక్‌కు గురైన బాధితురాలు వెంటనే కుటుంబ సభ్యులకు వివరాలు తెలియజేసింది. ఆదిలక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా దొంగలను గుర్తించేందుకు సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

మోటార్‌సైక్లిస్టుకు తీవ్రగాయాలు

● మరో ఇద్దరికి స్వల్పంగా..

ఒంగోలు క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌ను వెనుక నుంచి స్కూటీ ఢీ కొట్టిన ఘటనలో మోటార్‌సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఒంగోలు నగరం మంగమూరురోడ్డు జంక్షన్‌లోని వర్మ హోటల్ వద్ద ఆదివారం ఉదయం జరిగింది. టంగుటూరు మండలం మర్లపాడుకు చెందిన నాయుడు వెంకటరావు మోటార్‌సైకిల్‌పై స్వగ్రామం వెళుతున్నాడు. అదే సమయంలో ఒంగోలు శ్రీనగర్ కాలనీలో నివాసం ఉండే సానికొమ్మ శ్రీనివాసులు, నాగేందర్‌నగర్‌లో నివాసం ఉంటున్న ధరణిధర్‌లు స్కూటీపై వెళుతూ మోటార్ సైకిల్‌ని ఢీకొట్టారు. దీంతో రెండు వాహనాలు కింద పడ్డాయి. అయితే మోటార్ సైకిల్‌పై వెళుతున్న వెంకటరావు తలకు త్రీవ గాయమై రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. స్కూటీపై ప్రయాణం చేస్తున్న ఇరువురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ అవుట్ పోస్టు పోలీసులు ఇచ్చిన ఫిర్యాదులను తాలుకా పోలీస్‌స్టేషన్‌కు పంపిచారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఒంగోలు క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా సోమవారం ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాలలో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈ రంగారావు తెలిపారు.

- ఉదయం10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కర్నూల్‌రోడ్డు, శ్రీనగర్‌కాలనీ, భారత్ పెట్రోల్ బంకు, మారుతినగర్, అగ్లీలియం స్కూల్, ఎస్‌బీఐ, జడ్పీ కాలనీ, వప్రసాద్‌కాలనీ, జర్నలిస్టుకాలనీ, మంగమూరురోడ్డు, మర్రిచెట్టుకాలనీ, ప్రగతినగర్ ప్రాంతాల్లో కరెంటు సరఫరాల్లో అంతరాయం ఉంటుంది.
- ఉదయం 7 నుంచి 11 గంటల వరకు మీరావళి బేకరి, గాంధీపార్కు, మాంటిస్సోరిస్కూల్, కొండయ్య బంకురోడ్డు, టెంపుల్‌టవర్, రంగారాయుడు చెరువు టర్నింగ్, రైతు బజారు, సాయిబాబాగుడి, లాయర్‌పేట, వీఐపీరోడ్డు ఐబాకోపార్లర్, మంగమూరు రోడ్డు సిగ్నల్స్ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని డీఈవో కోరారు.

భగవద్గీత పారాయణంలో విద్యార్థి ప్రతిభ



భువనేశ్వర్‌రెడ్డిని అభినందిస్తున్న డైరెక్టర్ జగదీష్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత పారాయణ పరీక్షలలో ఒంగోలు విద్యార్థి ప్రతిభ చాటారు. స్థానిక హైదరాబాద్ సెంట్రల్ స్కూలుకు చెందిన భువనేశ్వర్‌రెడ్డి మైసూర్‌లోని అవధూత దత్త పీఠం నిర్వహించిన శ్రీమద్ భగవద్గీత పారాయణం పరీక్షలలో డిక్టింక్షన్‌లో పాసైనట్లు స్కూలు డైరెక్టర్ జగదీష్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా భువనేశ్వర్‌రెడ్డిని స్థానిక స్కూలులో ఉపాధ్యాయులు అభినందించారు.

'కుల నిర్మూలనతోనే హైందవుల ఐక్యత'

పొన్నలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కులాల నిర్మూలన ద్వారా హైందవుల ఐక్యత సాధ్యమవుతుందని సత్సంగ ప్రముఖుడు సోమా సుబ్బారావు పేర్కొన్నారు. పొన్నలూరు చెన్నకేశవ దేవాలయంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గడప లోపలే కులం అని, గడప దాటితే మనమంతా హిందువులమని తెలిపారు. కార్యదర్శి ఈదర బలరాం మట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మల్లవరపు శ్రీనివాసులు, జరుగుమల్లి, సింగరాయకొండ, కొండపి, మర్రిపూడి మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

సంతనూతలపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం గ్రామ పరిసరాల్లో జరుగుతున్న పేకాట శిబిరంపై ఒంగోలు ఈగల్ టీం ఎస్ఐ సుదర్శన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం దాడి చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు జూదరులను అరెస్టు చేసి రూ.22,060 నగదును స్వాధీనం చేసుకుని సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

సంతనూతలపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమవుతోందని, దానిని వెంటనే విరమించుకోవాలని వైసీపీ మండల డి.చెంచిరెడ్డి డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం సంతనూతలపాడులో కోటిసంతకాల సేకరణను చేపట్టారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మద్దిపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం ఏడుగుండ్లపాడు సమీపంలో జరిగింది. అద్దంకి నుంచి ద్విచక్రవాహనంపై ఆర్.రమేష్‌బాబు, పి.భూపతిబాబు ఒంగోలు వెళుతున్నారు. ఈక్రమంలో లారీ ఒక్కసారిగా వారి సమీపంలోకి రావడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో వారికి తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

జ్ఞానగమ్యం రామాయణం



రామాయణం బోధిస్తున్న స్వామి పవిత్రచైతన్య

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సత్య ధర్మ స్వరూపమైన రామాయణం మానవాళికి జ్ఞానగమ్యమని చిన్మయ మిషన్ ప్రబోధకుడు పవిత్ర చైతన్య పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు నగరం శ్రీగిరిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం గోక్షేత్ర భవనంలో నిర్వహించిన బాలవిహార్ శిక్షణ తరగతులలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రామాయణం, భాగవతం, భగవద్గీతలోని ఉపయుక్త విషయాలను వివరించారు. బాలవిహార్ శిక్షణ తరగతుల వల్ల విద్యార్థుల్లో బహుముఖ సంస్కారాలు పెంపొందుతాయన్నారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి పాల్గొని మాట్లాడుతూ బాలవిహార్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు రాసాని వెంకట రమణయ్య ఇచ్చిన పుస్తకాలతో బుక్ షో నిర్వహించారు. అదేవిధంగా సీహెచ్.కోటేశ్వరరావు పుస్తక పఠన ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తిరుపతిరావు, టి.శ్రీదేవి, సందీప్, గోవిందమ్మ పాల్గొన్నారు.

కన్యాకుమారి టు కశ్మీర్



భక్తిభావంతో ఓ వృద్ధుడు సైకిల్ యాత్ర
ఐదేళ్ల నుంచి కొనసాగుతున్న ప్రయాణం
ఆధ్యాత్మిక ఆలాయాల సందర్శన

ఆయన వయస్సు 60 ఏళ్లు పైనే ఉంటుంది.. ఆధ్యాత్మిక చింతన, మెండైన దైవభక్తి.. ఆలయాల సందర్శన అంటే ఆయనకు ఎంతో ఇష్టం.. ఆయన ఎవరో కాదు తమిళనాడు రాష్ట్రం, తిరున్వెల్లిలి జిల్లా, టెంకాసీ దగ్గర ఓ కుగ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన పేరు గోపాలకృష్ణఅయ్యర్. 2020 ఆగస్టులో కొవిడ్ సమయంలో ఆయన తన సైకిల్ యాత్రను ప్రారంభించాడు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాష్ట్రంలోని వివిధ రాష్ట్రాలలో పర్యటించి, హిందూ దేవాలయాలను సందర్శించి ఒక రాత్రి అక్కడ బస చేయాలన్నది ఆయన చిరకాల కోరిక. ఆయన ప్రయాణంలో భాగంగా శనివారం రాత్రి ఒంగోలులోని గోపాలనగర్‌లోని శ్రీగోకుల గోపాలశ్రీకృష్ణ భగవాన్‌స్వామి దేవస్థానంలో బస చేశారు. ఆయనకు ఓ ప్రత్యేకత ఉంది. ఎవరైనా భోజనం పెట్టినా, స్నానానికి వేడి నీళ్లు ఇచ్చినా, నగదు ఇచ్చినా తీసుకోడు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం చన్నీటితో స్నానం చేసి, ఆయనే స్వయంగా వంట చేసుకుని తిని, స్వామి వారి ఆలయాల్లో కటిక నేలపై నిద్రించి తిరిగి ప్రయాణం అవుతారు. ఐదేళ్లుగా వివిధ ప్రాంతాలలో పర్యటించిన



గోపాలకృష్ణ అయ్యర్, తనకు అవసరమైన నిత్యవసర సరుకులను వెంట తెచ్చుకుని మరీ వండుకుంటారు. ఇప్పటికే దేశంలో అనేక పుణ్యక్షేత్రాలను సందర్శించినట్లు ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

వంచనకు గురైన యువతి బలవన్మరణం

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. ఆ తర్వాత ప్రేమగా..
పెళ్లికి కులం అడ్డు అంటూ యువకుడు అభ్యంతరం
సంఘటనా స్థలంలో సూసైడ్ నోట్

ఒంగోలు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుకున్న యువతి వంచనకు గురై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన ఆదివారం ఉదయం ఒంగోలు నగరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే... ఒంగోలుకు చెందిన ఓ యువతి(33 సంవత్సరాలు) ఎంటెక్ చదువుకొని ఇంటి వద్దే ఉంటుంది. సుమారు 12 ఏళ్ల క్రితం స్థానిక మహేంద్రనగర్‌కు చెందిన సింగోతు శ్రీనివాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. ఆ పరిచయం ప్రేమగా మారింది. నువ్వు లేనిది నేను లేనంటూ నమ్మించాడు. తీరా పెళ్లి చేసుకోవాలని అడిగితే మన రెండు కులాలు వేరంటూ బుకాయించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆ యువతి ఆదివారం తెల్లవారుజామున సూసైడ్ నోట్ రాసి మంచం పక్కన పెట్టుకొని చీరతో ఇంటి దూలానికి ఉరివేసుకొంది. తండ్రి ఉదయం 9.30 గంటలకు టిఫిన్ ఇవ్వడానికి వెళ్లగా తలుపు తీయలేదు. ఇరుగుపొరుగు వారి సహకారంతో తలుపు తెరిచి చూడగా కుమార్తె ఇంటి దూలానికి వేలాడుతుంది. తన కుమార్తె మరణానికి సింగోతు శ్రీనివాస్ కారణం అని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఒంగోలు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు పంపించారు.

బాలిక ఆత్మహత్య

ప్రేమ విఫలం కావటమే కారణం!
ఆలస్యంగా వెలుగులోకి ఘటన

దర్శి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ బాలిక ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకుంది. ఈసంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... సదరు బాలిక(16) దర్శిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతుంది. తల్లిదండ్రులు, సోదరులు హైదరాబాద్‌లో బేల్దారీ పనులు చేస్తూ ఎక్కువ రోజులు అక్కడే ఉంటారు. అమ్మమ్మ, తాతయ్యల వద్ద ఆ బాలిక ఉండి కళాశాలకు రోజూ వెళ్లివస్తుంది. ఈక్రమంలో నవంబరు 30న ఆరోగ్యం బాగాలేదని మందులు వేసుకున్నట్లు అమ్మమ్మకు చెప్పింది. ఈ నెల 1న పరిస్థితి ఇబ్బందిగా ఉండటంతో తాతయ్య, అమ్మమ్మలు పొదిలిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఆ బాలిక ఎలుకల మందు తాగినట్లు చెప్పారు. వైద్యం చేసినప్పటికీ అదేరోజు సాయంత్రం మృతి చెందింది. ఆ బాలిక ఎలుకల మందు ఎందుకు తాగిందనే విషయం అప్పుడు తెలియలేదు. హైదరాబాద్ నుంచి తల్లిదండ్రులు వచ్చి కారణాలు తెలుసుకోగా అదే గ్రామానికి చెందిన సీహెచ్ నరేంద్ర అనే యువకుడు ప్రేమించినట్లు తెలుసుకున్నారు. ఆ యువకుడు పెళ్లి చేసుకునేందుకు నిరాకరించటంతో బాలిక ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. తొలుత ఆత్మహత్యగా కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం సెక్షన్లు మార్చి పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.మురళీ తెలిపారు.

కూచిపూడికి చెందిన వ్యక్తి ఆత్మహత్య

పేర్నమిట్ట చెరువు సమీపంలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం

సంతనూతలపాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేర్నమిట్ట చెరువు సమీపంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాలూకా ఎస్సై హరిబాబు తెలిపిన సమాచారం మేరకు... మద్దిపాడు మండలం కూచిపూడికి చెందిన చేగిరెడ్డి పుల్లారెడ్డి(34)కి వివాహమై మూడేళ్లు అయింది. ఇతనికి ముగ్గురు ఆడపిల్లలు. బేల్దారీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతుంటాడు. పుల్లారెడ్డి మద్యానికి బానిసై భార్యాబిడ్డలను సరిగా చూసుకోకపోవడంతో తరచూ ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈనెల 3న బేల్దారీ పనులకు బెంగళూరు వెళ్తున్నానని చెప్పి, పేర్నమిట్టలో ఉంటున్న సోదరి ఇంటికి వచ్చాడు. అనంతరం ఆరోగ్యం బాగోలేదని ఒంగోలులో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది బయటకు వచ్చి, ఈ నెల 4న సోదరికి చెప్పి వెళ్లిపోయాడు. ఈక్రమంలో ఆదివారం చెరువు సమీపంలో ఉరివేసుకుని ఉన్న ఓ వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటాన్ని పుట్టకొక్కులను వేరుకునే కొందరు గమనించి తాలుకా పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే ఎస్సై హరిబాబు సంఘటన ప్రాంతానికి చేరుకుని ఆత్మహత్యకు పాల్పడిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మృతుని జేబులోని ఆధార్ తదితర వివరాలను గమనించి మృతుడు మద్దిపాడు మండలం చేగిరెడ్డి పుల్లారెడ్డిగా గుర్తించారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

డెలివరీ బాయ్‌పై రౌడీషీటర్ పాశవిక దాడి


స్థానికులనూ అసభ్యకరంగా మాట్లాడిన వైనం

ఒంగోలు క్రైం,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఓ సంస్థలో డెలివరీబాయ్‌ను మద్యం మత్తులో ఉన్న ఓ రౌడీషీటర్ మోటార్ సైకిల్‌తో ఢీకొట్టడమేగాక విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ సంఘటన శనివారం రాత్రి 10 గంటల సమయంలో స్థానిక నిర్మల్‌నగర్‌లో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... నగరంలోని ఓ సంస్థలో పార్శిల్ బాయ్‌గా పనిచేస్తున్న కిష్టిపాటి గణపతి మంగమూరు రోడ్డులో పార్శిల్ తీసుకొని కర్నూల్ రోడ్డులో పవర్ ఆఫీస్ వద్ద డెలివరీ ఇచ్చేందుకు బయలుదేరాడు. నిర్మల్ నగర్‌లో రాఘవ ఆసుపత్రివద్ద గోపాల్‌నగర్‌కు చెందిన ఏకాంబరం నరేంద్ర అలియాస్ టిల్లు మద్యం సేవించి బుల్లెట్‌పై ఎదురు వెళుతూ గణపతిని ఢీకొట్టాడు. దీంతో మోటార్ సైకిల్‌పై నుంచి కింద పడిన గణపతి ప్రశ్నించగా రౌడీషీటర్ టిల్లు విచక్షణారహితంగా దాడిచేశాడు. ఇదేమిటని అడిగిన స్థానికులను సైతం ఇష్టానుసారం అసభ్యకరంగా మాట్లాడాడు. అంతేకాదు గణపతి మోటార్ సైకిల్ తాళం లాక్కొని టిల్లు వెళ్లిపోయాడు. రౌడీషీటర్ ఆగడాలపై స్థానికులు సైతం విస్తుపోయారు. అతనిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు పోలీసులును కోరారు. ఈ సంఘటనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రౌడీషీటర్ ఆగడాలపై చర్యలు లేకపోవడం ఏమిటి అనీ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ప్రశాంతంగా స్కాలర్‌షిప్ పరీక్ష

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 4,009 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగింది. పరీక్షకు 3,813 మంది విద్యార్థులు హాజరు కాగా 196 మంది గైర్హాజరయ్యారు. కనిగిరి డివిజన్‌లోని పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఒంగోలు, మార్కాపురం డివిజన్‌లోని పరీక్షా కేంద్రాలను ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు పరిశీలించారు. ఈ పరీక్షల్లో ఎంపికయ్యే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తుంది. దీంతో ఈ పర్యాయం విద్యార్థులు పోటీపడి పరీక్షలకు హాజరయ్యారు.

ప్రభుత్వ బహుజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడుగా అంజయ్య



సమావేశంలో నాయకులు

ఒంగోలు (రూరల్), డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): బహుజన ప్రభుత్వ ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా తేళ్ల అంజయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఒంగోలులోని హైదరీక్లబ్‌లో బహుజన ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బహుజన ఉద్యోగులు సమస్యలపై చర్చించారు. అనంతరం సంఘ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మిడసల నాగార్జున, ఉపాధ్యక్షులుగా నక్కా కాంతారావు, జి.అవినాష్, సహాయ కార్యదర్శిగా జె.నారాయణరావు, సంయుక్తకార్యదర్శిగా ఎం.తిరుపాలు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జె.వీరాంజనేయులు, కోశాధికారిగా ఎస్.లలితకుమారి ఎన్నికయ్యారు.

రూ.28 లక్షలు వీవోఏ స్వాహాపై మంత్రికి ఫిర్యాదు

కేసు నమోదు చేయాలని
స్వామి ఆదేశం



మంత్రి స్వామి ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న మహిళలు

తూర్పునాయుడుపాలెం(కొండపి), డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామానికి చెందిన వీవోఏ పొట్లూరి పద్మ పొదుపు మహిళలు బ్యాంకులో కట్టాలని ఇచ్చిన వాయిదా డబ్బుతోపాటు, ఏడుగురు మహిళలకు చెందిన స్త్రీ నిధి డబ్బులు దాదాపు ఏడు లక్షల రూపాయలు స్వాహా చేసి, దిక్కున్నచోట చెప్పుకోవాలని బెదిరిస్తోందని దావగూడూరు గ్రామానికి చెందిన శ్రీ ఆంజనేయ, వెంకటరమణ గ్రూపు సభ్యులు దాదాపు 20 మంది మంత్రి స్వామి ఎదుట వాపోయారు. టంగుటూరు తూర్పునాయుడుపాలెంలోని స్వామి క్యాంపు కార్యాలయానికి జరుగుమల్లి మండలం దావగూడూరు మాజీ సర్పంచ్ చదలవాడ బ్రహ్మేంద్రంను వెంట పెట్టుకుని మహిళలు స్వామిని ఆదివారం కలిశారు. ఈసందర్భంగా పొదుపు మహిళలు స్వామి ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. తాము కష్టపడి కూడబెట్టుకుని బ్యాంకు రుణానికి జమ చేయాలని ఇస్తే ఆమె బ్యాంకు, వెలుగు అధికారుల అండదండలతో కాజేసిందని వారు వాపోయారు. వీవోఏకు అంత డబ్బులు వాడుకునే ధైర్యం లేదని, అడిగితే ఎవరికో ఇచ్చానని చెబుతున్నదన్నారు. ఈవిషయమై స్వామి డీఆర్‌డీఏ- వెలుగు పీడీతో వెంటనే ఫోన్‌లో మాట్లాడారు. డబ్బులు స్వాహా వెనుక ఎవరున్నారనేది వెలికితీసి ఉద్యోగులైనా, నాయకులైనా సరే కేసు నమోదు చేయిస్తామని,ఆ డబ్బులు జమయ్యేలా చర్యలు చేపట్టాలని మంత్రి పీడీని ఆదేశించారు. అదేవిధంగా జరుగుమల్లి మండలంలోని దావగూడూరుతోపాటు, సింగరాయకొండ మండలం బింగినపల్లిలో కూడా ఇలాగే డ్వాక్రా మహిళల డబ్బులు స్వాహా అయిన విషయాన్ని స్వామి స్వయంగా సింగరాయకొండ సీఐ హజరత్తయ్యకి ఫోన్ చేసి రెండు ఘటనలలో మోసానికి పాల్పడిన వీవోఏలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రాపూరి లక్ష్మమ్మ, నంబూరి జయమ్మ, చెలంచెర్ల లీలమ్మ పాల్గొన్నారు. రెండు గ్రూపులకు చెందిన రూ.21 లక్షలు, మరో ఏడు లక్షల రూపాయలు డ్వాక్రా మహిళల స్త్రీనిధి డబ్బులు స్వాహా చేసిందని వారు వాపోయారు.

పురాతన దేవాలయాలకు మహర్దశ

మంత్రి స్వామి చొరవతో రూ.4.23 కోట్లు మంజూరు



తంగెళ్లలోని పురాతన రామలింగేశ్వరస్వామి దేవాలయం

మద్దిపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నోఏళ్లుగా ఆలనాపాలనాకు నోచుకోని పలు పురాతన దేవాలయాల పునరుద్ధరణ కోసం రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రత్యేక చొరవ చూపించారు. దేవాలయాల పునరుద్ధరణ కోసం రూ.4.23కోట్ల సర్వశ్రేయోనిధి నుంచి నిధులు మంజూరు చేయించారు. దీంతో పురాతన దేవాలయాలు నూతన శోభను సంతరించుకోనున్నాయి. జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మద్దిపాడులోని పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పునర్నిర్మాణం కోసం రూ.2.05కోట్లు విడుదలయ్యాయి. అలాగే అతిపురాతనమైన తంగెళ్ల రామలింగేశ్వరస్వామి దేవాలయానికి ఆస్తులు ఉన్నప్పటికీ ఆలనాపాలన లేక పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పైకప్పు శిథిలమైపోవడంతో కొద్దిపాటి వర్షానికే దేవాలయం జలమయమవుతుంటుంది. దీంతో గ్రామస్థులు దేవుని విగ్రహాలు తడవకుండా ఉండేందుకు ప్లాస్టిక్ పరదాను కప్పి తాత్కాలిక రక్షణ చర్యలు తీసుకున్నారు. ఏట లక్షల రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ దేవదాయశాఖ అధికారులు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో చారిత్రక నేపథ్యం కలిగిన ఆ దేవాలయం ఏక్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం పొంచిఉంది. ఎన్నో ఏళ్లుగా తంగెళ్ల గ్రామస్థులు దేవాలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టాలని పాలకులను వేడుకుంటూనే ఉన్నారు. ఈనేపథ్యంలో మంత్రి స్వామి ఆ దేవాలయం అభివృద్ధికి రూ.66.67లక్షలు నిధులు మంజూరు చేయించారు. అలాగే జంగాలపల్లి రామాలయం పునరుద్ధరణకు రూ.20లక్షలు, మద్దిపాడులో ఆనంవారి ఇంటి ఆడపడుచుగా పేరుగాంచిన ముత్యాలమ్మ దేవాలయం అభివృద్ధికి రూ.86.67 లక్షలు నిధులు మంజూరు చేయించారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని తమ ఇంటి కులదేవత అయిన ముత్యాలమ్మ గుడిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే దేవాలయాల పునరుద్ధరణకు పెద్దఎత్తున నిధులు మంజురు చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

కారుమంచి మేజర్‌కు మంచిరోజులు

కూలిన కట్ట పునరుద్ధరణకు
లైన్‌క్లియర్
డిజైన్ కోసం ప్రతిపాదనలు పంపాలని
సీఈ ఆదేశం
సాయిల్ టెస్ట్ చేయించి ఫలితం కోసం
వేచిచూస్తున్న అధికారులు
వేసవిలో పనులు మొదలు పెట్టడానికి
వీలుగా కసరత్తు
ఫలించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్,
ఎన్ఆర్ఐ శేషయ్యల కృషి



సాయిల్ టెస్ట్ చేస్తున్న నిపుణులు

చీమకుర్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్ల క్రితం గ్రానైట్ క్వారీలో కుప్పకూలిన కారుమంచి కాలువ కట్ట పునరుద్ధరణకు ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, ఎన్ఆర్ఐ నల్లూరి వెంకటశేషయ్యల కృషితో కారుమంచి మేజర్ పునరుద్ధరణ పనులు ప్రారంభించటానికి ఎదురైన అడ్డంకులు తొలగిపోయాయి. సీఎంవో నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎన్ఎస్‌పీ సీఈ నుంచి జిల్లా ఎస్ఈకి స్పష్టమైన ఆదేశాలు అందాయి. త్వరితగతన కట్ట పునరుద్ధరణకు డిజైన్ నిర్మించటానికి అంచనా ప్రతిపాదనలను త్వరితగతిన పంపాలని ఆదేశించారు. ఈ మేరకు అంచనాలు రూపొందించటానికి అవసరమైన సాయిల్ టెస్ట్‌ను అధికారులు నిపుణులచేత పూర్తి చేయించారు. పరీక్షలో తేలిన ఫలితానికి అనుగుణంగా కట్ట పునరుద్ధరణకు అంచనాలు తయారుచేసి డిజైన్ రూపొందించి ఆమోదిస్తారు. తదుపరి అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ అనుమతులు పొంది ఈ ఏడాది వ్యవసాయ సీజన్ ముగిసిన తర్వాత వేసవిలో పనులు ప్రారంభించేలా ఎన్ఎస్‌పీ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అవరోధాలను అధిగమించి...

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల క్రితం కారుమంచి మేజర్ కాలువ 0.350నుంచి 0.900కి.మీ వరకూ పక్కనే ఉన్న గ్రానైట్ క్వారీలో కుప్పకూలిపోయింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన క్వారీయింగ్ వలన కట్ట కూలిపోవటం దాదాపు 18 గ్రామాల ప్రజలకు ఆశనిపాతంలా మారింది. మేజర్ కింద ఉన్న దాదాపు 20వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 18గ్రామాల ప్రజలకు తాగునీరు సక్రమంగా అందని పరిస్థితి ఏర్పడింది. అయినా గత వైసీపీ ప్రభుత్వం సంకుచిత ధోరణితో రాజకీయకోణంలో ఆలోచించి కట్ట పునరుద్ధరణకు చర్యలు చేపట్టలేదు. కట్ట కూలిన చోట తాత్కాలికంగా కాలువను బైపాస్ చేసి నీటిసరఫరాను చేస్తూ వచ్చారు. దీనివలన 135క్యూసెక్కుల నీరు ప్రవహించాల్సిన కాలువలో నలభై క్యూసెక్కులకులోపే పరిమితం కావటంతో ఆయకట్టు రైతాంగం నాలుగేళ్ల నుంచి సాగునీటి కోసం నానాఇబ్బందులు పడుతున్నారు. వందల ఎకరాలు బీడుగా మారిన దుస్థితి ఏర్పడింది. రైతుల బాధలను స్వయంగా వీక్షించిన బీఎన్ విజయ్‌కుమార్ ఎన్నికల నాడు కట్ట పునరుద్ధరణపై స్పష్టమైన హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావటంతో కట్ట పునరుద్ధరణ దిశగా అడుగులు పడ్డాయి. మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రి, అధికారులను ఒప్పించి డీఎంఎఫ్ నుంచి రూ.2.60కోట్లను మంజూరు చేయించటంలో ఎమ్మెల్యే బీఎన్ సఫలీకృతులయ్యారు. ఇక పనులు ప్రారంభమే అనుకుంటుండగా జరిగిన పరిణామాలు మళ్లీ మొదటికొచ్చింది. ఈ నేపథ్యంలో పనులకు బ్రేక్ పడటానికి గల కారణాలను 'కారుమంచి మేజర్ కర్షకులు కడగండ్లు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆయకట్టు రైతులు పెద్దఎత్తున కలెక్టరేట్ వద్ద పార్టీలకతీతంగా ధర్నా చేశారు. దీనికి స్పందించిన ఇరిగేషన్ ఉన్నతాధికారులు తమ తప్పు సరిదిద్దుకునే పనిని చేపట్టారు. మరోవైపు ఎమ్మెల్యే విజయ్‌కుమార్, మొదటినుంచి కట్ట పునరుద్ధరణ కోసం కృషి చేస్తున్న ఎన్ఆర్ఐ నల్లూరి వెంకటశేషయ్యలు.. ఎదురైన అవరోధాలను తొలగించేలా చర్యలు చేపట్టారు. ఆ మేరకు లైన్ క్లియర్ అయ్యేలా రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

వేసవిలో కట్ట పునరుద్ధరణను ప్రారంభిస్తాం
వరలక్ష్మి, ఎస్ఈ

ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కారుమంచి మేజర్ కట్ట పునరుద్ధరణ పనులు వేసవిలో ప్రారంభించటానికి అవసరమైన ముందస్తు కసరత్తును ప్రారంభించాం. రాబోయే వ్యవసాయ సీజన్‌కు పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేసి 135 క్యూసెక్కుల జలాలు ప్రవహించేలా కట్టను పటిష్ఠంగా నిర్మించటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

వచ్చే నెల 3 నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జనవరి 3వ తేదీ నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనున్నట్లు ఆంధ్రసారస్వత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆదివారం ఒంగోలులోని నెక్స్‌జెన్ పబ్లిక్ స్కూలు ప్రాంగణంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినోట తెలుగుమాట అన్న నినాదంతో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు మూడురోజులపాటు అమరావతిలోని శ్రీ సత్యసాయి స్పిరిచ్యువల్ సొసైటీలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటిరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహాసభలు ప్రారంభిస్తారని, అదేవిధంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేషతో పాటు ఆరు రాష్ట్రాల గవర్నర్లు పాల్గొంటారన్నారు. ఈ సభలలో పద్య, వచన, అవధాన, భక్తి, సాహిత్య సదస్సులు, పత్రిక, బాల సాహిత్య, జానపద, విజ్ఞానం, చలనచిత్ర, సాహిత్యాలపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రకాశం జిల్లా నుంచి కూడా కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్యాభిమానులు ఈ మహాసభలలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ప్రవేశరుసుం లేదని, పాల్గొనేవారికి భోజన, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రరసం అధ్యక్షుడు పొన్నూరి వెంకటశ్రీనివాసులు, యత్తపు కొండారెడ్డి, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నెక్స్‌జెన్ స్కూలు డైరెక్టర్లు మురళీధర్‌రెడ్డి, శ్రీకాంత్, అరవింద, శ్రీవిద్య, ప్రిన్సిపాల్ రమేష్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు


శివాలయం వద్ద పారిశుధ్య పనులు చేయిస్తున్న అధికారులు

పారిశుధ్యంపై అధికారుల దృష్టి

● ఎక్స్‌కవేటర్‌తో చెత్త తొలగింపు

తర్లుపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించారు. కొన్ని రోజులుగా తర్లుపాడులో పారిశుధ్యం పడకేసింది. మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. వారం రోజుల క్రితం మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణ రెడ్డి చెన్నారెడ్డిపల్లిలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమానికి వెళ్తుండగా శివాలయం వద్ద మురుగునీరు ఉండటాన్ని గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో తర్లుపాడులో పారిశుధ్య పనులు చేయాలని ఆదేశించారు. దీంతో ఈవోఆర్డీ రాఘవరావు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తర్లుపాడులో పారిశుధ్య పనులపై దృష్టి సారించారు. శివాలయం ముందు ఉన్న మురుగునీరును ఎక్స్‌కవేటర్ ద్వారా తీయించి, అక్కడ ఉన్న చెత్తను తొలగించారు. ఎంపీడీవో కార్యలయం వద్ద నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తను డోజర్ ద్వారా తొలగించారు. తర్లుపాడు గ్రామంలో చెత్తను వేసేందుకు తొట్లను కూడా ఏర్పాటు చేశారు.


వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న వానరాలు

గిద్దలూరులో కోతుల బెడద

గిద్దలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మండలంలో ప్రజలు కోతుల బెడదను ఎదుర్కొంటున్నారు. అధికారులు ఎన్నిసార్లు కోతులను పట్టించి అడవిలో వదిలిపెట్టినా అవి తిరిగి వస్తుండడంతో ప్రజ లు అవస్థలు పడుతున్నారు. మండల శివార్లలో నల్లమల అటవీ ప్రాంతం ఉండడంతో తరచూ కోతులు గిద్దలూరు పట్టణంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో చెట్లపై తిష్ఠవేస్తున్నాయి. ఆహారం కోసం వీధుల వెంట తిరుగుతూ భయాందోళన కలిగిస్తున్నాయి. పలుసందర్భాలలో ప్రజలను కరుస్తుండడంతో గాయాలపాలు అవుతున్నారు. గిద్దలూరు పట్టణంలోని సగానికి పైగా ప్రాంతాలలో ప్రజలు కోతుల బెడదను ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు పెద్ద ఎత్తున కోతులను పట్టించి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఘనంగా ఘంటసాల జయంతి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంజీవో హోంలో గానగంధర్వుడు ఘంటసాల జయంతిని త్రివిక్రమ అభ్యుదయ కళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఎన్‌జీవో సంఘ నాయకులు బీవీఎస్ శ్రీనివాస శాస్త్రి , సాయి మందిర కార్యదర్శి, విశాంత్ర కోఆపరేటివ్ రిజిస్ట్రార్ గోపాలుని హరిహరరావు తదితరులు మాట్లాడారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్రివిక్రమ కళాసంఘం నాయకులు చిత్తారి రంగనాయకులు, పుర ప్రముఖులు, సాయి మందిర అధ్యక్షులు సత్యనారాయణ, నాగరాజు, జక్క సుబ్రహ్మణ్యం, ఎంవీ రమణ, రామకృష్ణారెడ్డి, రాయపు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం పూజలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులో వెలసి ఉన్న శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక జాతర నిర్వహించారు. అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించారు. పూజల అనంతరం భక్తులు పొంగళ్లు వండి బోనాలు సమర్పించారు. నాగదేవతల విగ్రహాలకు పూజలు చేసి నాగుల పుట్టలో పాలు పోశారు. కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశుల రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

మార్కాపురం జిల్లాలో దర్శిని కలపాలని సంతకాల ఉద్యమం

మార్కాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నూతన ఏర్పడబోతోన్న మార్కాపురం జిల్లాలో దర్శి నియోజకవర్గాన్ని కూడా కలపాలని కోరుతూ ఈ నెల 8వ తేదీ నుంచి సంతకాల ఉద్యమం చేపట్టనున్నట్లు విద్యావంతులు, మేధావుల వేదిక నాయకులు ఓరుగంటి మల్లిక్, ఎ.వీరారెడ్డి, ఈద చెన్నయ్యలు తెలిపారు. ఉదయం 11.00 గంటలకు స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేస్తామన్నారు. అంతేకాక మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పొట్టి శ్రీరాములులాంటి మహానుభావుల విగ్రహాలకు వినూత్నంగా వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎస్‌ఎస్ పరీక్షలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ రాత పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మార్కాపురంలోని 8 కేంద్రాలలో జరిగిన ఈ పరీక్షలలో 1,588 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో శర్వాణీ తెలిపారు. అనంతరం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇచ్చే మెరిట్ స్కాలర్‌షిప్ కోసం నిర్వహించిన ఈ ప్రతిభ పోటీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి 24 వేల రూపాయల స్కాలర్‌షిప్ ఇస్తారని ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్ తెలిపారు.

అట్టహాసంగా ఎరిక్షన్‌బాబు పుట్టినరోజు వేడుకలు

● అభిమానుల మధ్య ఘనంగా నిర్వహణ

ఎర్రగొండపాలెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పుట్టినరోజు వేడుకలు ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మధ్య అట్టహాసంగా జరిగాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు తరలి వచ్చి ఎరిక్షన్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ , పోలీసు అధికారులు, ఉద్యోగులు గూడూరిని పూలమాలాంకృతం చేసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు


ఎర్రగొండపాలెంలో టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుకు బర్త్‌డే కేక్ తినిపిస్తున్న మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు

తెలిపారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఎరిక్షన్‌బాబుకు క్రేన్ సహాయంతో గజమాలను వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ నుంచి టీడీపీ కార్యాలయం వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి ఎరిక్షన్‌బాబు కేక్ కట్ చేశారు. ఎక్కువ మంది నాయకులు, అధికారులు బొకేలు, పూలమాలలకు స్వస్తి చెప్పి వినూత్నంగా విద్యార్థులకు ఉపయోగపడే నోటుపుస్తకాలు, పెన్నులు ఆయనకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ సీనియర్ నాయకులు శనగా నారాయణ రెడ్డి, కాకర్ల కోటయ్య, గొట్టం శ్రీనివాసరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, మండలాల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, షేక్ మాబు, పోట్ల గోవింద్, మేకల వలరాజు యాదవ్, టీడీపీ ముఖ్య నాయకులు కందుల నారాయణ రెడ్డి, పయ్యావుల ప్రసాద్, గజ్జెల్లి భాస్కర్, ఉప్పల హనుమంతు, బి. లక్ష్మణచౌదరి, వేగినాటి శ్రీను, కంచర్లసత్యనారాయణగౌడ్, సొసైటీ అధ్యక్షుడు తోట మహేష్, కొత్తమాసు సుబ్రమణ్యం, గ్రామ కమిటీ అధ్యక్షుడు, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఎర్రగొండపాలెం తహసీల్దారు మంజునాథరెడ్డి, దోర్నాల తహసీల్దార్ అశోక్‌రెడ్డి, రెవెన్యూ ఉద్యోగులు, సీఐ అజయ్‌కుమార్, నాలుగు మండలాల ఎస్ఐలు ఈ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల


ఎరిక్షన్‌బాబును గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు

నుంచి వచ్చిన కార్యకర్తలకు,అభిమానులకు భోజనం ఏర్పాటు చేశారు.

పెద్దదోర్నాలలో..

పెద్దదోర్నాల :స్థానిక ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ మాబు అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును కత్తిరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్ రెడ్డి, సర్పంచ్ చిత్తూరి హారిక, సీనియర్ నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, కటికల శ్రీనివాసులు, పీ రామిరెడ్డి, షేక్ మౌలాలి, దర్శనం దేవయ్య, రావెళ్ల సత్యనారాయణ, ఎలకపాటి చెంచయ్య, బాబు, జంగిలి పిచ్చయ్య, కే సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం అభివృద్ధి ప్రజాప్రభుత్వంతోనే సాధ్యం

● ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకే కోటి సంతకాల సేకరణ

● కృతజ్ఞతా సభలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం సమగ్రాభివృద్ధి ప్రజాప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అన్నారు. స్థానిక ఎస్సీ బీసీ కాలనీలో ఆదివారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో కృతజ్ఞతా సభ జరిగింది. స్థానిక 10, 11 వార్డులకు చెందిన ప్రజలు ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం డివిజన్ ప్రజల్ని నమ్మించి నట్టేట ముంచింది గత వైసీపీ ప్రభుత్వమన్నారు. ఎన్ని ఉద్యమాలు చేసినా మార్కాపురం జిల్లా ఇవ్వకుండా, వెలిగొండ పూర్తి చేయకుండా నమ్మి ఓట్టేసిన ప్రజల్ని నిలువునా మోసం చేశారన్నారు. ప్రస్తుతం వైసీపీ నాయకులు మెడికల్ కాలేజీలపై లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ప్రజల్ని మోసం చేసేందుకే కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని విమర్శించారు. వాస్తవానికి పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు పూర్తి చేసినా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే అవి నడుస్తాయన్నారు. 70 శాతం బెడ్లు పేదలకు ఉచితంగా ఇస్తారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేస్తూ ముఖ్యమంత్రి మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలిపారన్నారు. ఆయనకు ఈ ప్రాంత ప్రజలు జీవితాంతం రుణపడి ఉంటారన్నారు. మార్కాపురంకు త్వరలో మిర్చి యార్డును తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మేడిద రంగస్వామి, టీడీపీ నాయకులు పఠాన్ హుసేన్‌ఖాన్, సయ్యద్ గఫార్, మొఘల్ జాబిర్ హుసేన్‌బేగ్, దొడ్డా దుర్గేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కృతజ్ఞతా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి


మల్లవరంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

పశ్చిమప్రాంత అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పొదిలి :పశ్చిమప్రాంత అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు దోర్నాల అంజిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మల్లవరం గ్రామంలో ప్రత్యేక జిల్లా ప్రకటించినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం నేడు జిల్లా ప్రకటన చే యడం చాలా ఆనందంగా ఉందన్నారు. అందుకు కృతజ్ఞతగా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వర్ణగీత, మాదిరెడ్డిపాలెం సొసైటీ చైర్మన్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఖుద్దూస్, సోమయ్య, మునిశ్రీను, తానికొండ వెంకట్రావు, యాసిన్, జ్యోతిమల్లిఖార్జున్, గ్రామ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా మొక్కజొన్న సాగు

పెద్దదోర్నాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :మండలంలో రబీ సీజనులో మొక్కజొన్నపైరున రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రధానంగా మిర్చి,పత్తి సాగు చేసేవారు అయితే ఈ ఏడాది మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పోటెత్తిన వరద ప్రవాహం పంటలను ముంచెత్తింది. దీంతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు దిక్కుతోచలేదు. ఇప్పటికీ కొందరు రైతులు కోలుకోలేదు. పాడైన పంటలను తొలగించి ఆ స్థానంలో మళ్లీ ఏపైర్లు సాగు చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో మొక్కజొన్న విత్తన కంపెనీ ఏజన్సీల వారు గ్రామాలకు వచ్చారు. ఎకరాకు పది వేలు రూపాయలు ఆర్థిక సహాయం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేస్తామని, టన్ను రూ.35,000ల వరకు తామే కొనుగోలు చేస్తామని చెప్పారు. ఎంత లేదన్నా ఎకరంపై 3 టన్నుల దిగుబడి వస్తుందని ఏజన్సీలు తెలిపాయి. కొంత దిగుబడులు తగ్గినా, ఖర్చులన్నీ పోనూ ఎకరాకు యాభై నుంచి అరవై వేలు నికరాదాయం లభిస్తుందని భావిస్తున్నారు. దీంతో ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఊరటగా అనిపించింది. పైగా మూడు నెలల కాల పరిమితి కావడం, పెద్దగా కూలీలతో పని లేక పోవడం, సేద్యం ఖర్చు కూడా తక్కువగా ఉండటం కలిసి వచ్చింది. దీంతో పోలోమని ఎకరాలకు ఎకరాలు విత్తన మొక్కజొన్న సాగుకు ఉపక్రమించారు. మండలంలోని నల్లగుంట్ల,చిలకచెర్ల, ఎగువ చెర్లోపల్లి,కొత్తూరు, గంటవానిపల్లె, యడవల్లి, తిమ్మాపురం, కడపరాజుపల్లె, తదితర గ్రామాల్లో అధిక సంఖ్యలో విత్తారు. మండలంలో సుమారు వెయ్యిఎకరాలకు పైగా సాగు చేసినట్లు రైతులు చెబుతున్నారు.


దోర్నాల ప్రాంతంలో సాగు చేసిన మొక్కజొన్న


కంపెనీల నుంచి ఒప్పందం పత్రాలు తీసుకోవాలి

మండలంలో విత్తన మొక్కజొన్న సాగు రైతులకు శ్రమ, ఖర్చు విధానంలో మంచిదేనని అయితే సంబంధిత ఏజన్సీల నుంచి ఒప్పందం పత్రాలను రైతులు విధిగా తీసుకోవాలని వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ సూచిస్తున్నారు.

- ఏవో జవహర్ లాల్ నాయక్

యోగా గురూజీ నారాయణరెడ్డికి అవార్డు

గిద్దలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ బి.ఎస్.నారాయణరెడ్డికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరున సామాజిక పరివర్తన అవార్డును ప్రధానం చేశారు. ఒంగోలు ఎన్‌జీవో హోంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా నారాయణరెడ్డికి అవార్డును అందచేశారు. గత 3 దశాబ్దాలుగా బద్వేలు, గిద్దలూరు ప్రాంతాలలో నారాయణరెడ్డి చేసిన సేవలను పలువురు కొనియాడారు.


ఒంగోలులో యోగా గురూజీ నారాయణరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

రంగనాయకుడి క్షేత్రాన్ని సందర్శించిన డీఎస్పీ

రాచర్ల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) : నెమలిగుండ్ల రంగనాయక స్వామి క్షేత్రాన్ని మార్కాపురం డీఎస్పీ యూ నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఆలయ ప్రాంగణాన్ని, లక్ష్మమ్మ వనం, రంగస్వామి ఆలయం, నీటి గుండం, తదితర పరిసరాలను వారు పరిశీలించారు. రంగస్వామి దేవస్థానం విశిష్టతను గురించి స్థానికులతో కొద్ది సమయం చర్చించారు. డీఎస్పీ వెంట రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటిచెర్ల సబ్ స్టేషన్ పరిధిలోని హసనాపురం, తాటిచర్ల గ్రామాలలో సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆర్‌డీఎస్‌ఎస్ కొత్త లైన్లు వేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆశాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గాండ్ల సంక్షేమసంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

పొదిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గాండ్ల సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక ఎన్‌జీవో హోంలో ఆవిష్కరించారు. అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారావు, గురుస్వాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర సంఘం నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిట్టెంశెట్టి కృష్ణారావు, దాసరి గురుస్వాములును ఎన్నుకున్నారు.

బెల్ట్ గ్రేడింగ్ టెస్టుకు 45 మంది విద్యార్థుల ఎంపిక

గిద్దలూరు టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కరాటే డూ అకాడమిలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. మాస్టర్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో మొత్తం 45 మంది విద్యార్థులు వివిధ స్థాయిల్లో పరీక్షల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఉత్తీర్ణులైన వారికి బెల్టులు అందించి అభినందించారు.


బెల్టు గ్రేడింగ్ టెస్టుకు ఎంపికైన విద్యార్థులు

గుండెపోటుతో రైతుకూలీ మృతి

పొదిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండంలోని కాటూరివారిపాలెం గ్రామంలో గుండెపోటుతో రైతుకూలి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. మాదాల రాంబాబు(42) కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఒంట్లో నలతగా ఉండటంతో టానిక్ తాగారని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం వాంతులు రావడంతో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


పదోతరగతి విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈవో సుబ్బారావు

టెన్త్ విద్యార్థులకు యాక్షన్ ప్లాన్

తర్లుపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను తయారు చేశారు. పది విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులు అయ్యే విధంగా ప్రభుత్వం అమలు చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలును ఎంఈవో అచ్చుత సుబ్బారావు పరిశీలించారు. కలుజువ్వలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కస్తూరిబా గాంధీ విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థులకు యాక్షన్ ప్లాన్ కింద అమలు చేస్తున్న విద్యా బోధనను పరిశీలించి, పలు సూచనలు సలహాలు ఇచ్చారు. 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం కూడా ఏర్పాటు చేసి సంబంధింత సబ్జెక్టు టీచర్లు ఈ యొక్క స్టడీ క్లాసులను నిర్వహిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు వచ్చిన మార్కులను లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆదివారం జరిగిన స్టడీ క్లాసులపై ఎంఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కస్తూర్బా ప్రిన్సిపాల్ మారుతీదేవి, కలుజువ్వలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిలకపాటి సత్యనారాయణ ఉన్నారు.


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

దివ్యాంగులకు వరాల జల్లుపై హర్షం

● సీఎం చిత్రపటానికి ఎరిక్షన్‌బాబు పాలాభిషేకం

ఎరగొండపాలెం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమలు చేస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. ముఖ్యంగా దివ్యాంగుల కోసం 7 అద్భుతమైన పథకాలకు శ్రీకారం చుట్టి వారికి సంక్షేమంతో పాటు మరిన్ని సౌకర్యాలు అందిస్తున్న ఘనత చంద్రబాబుదేనని అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వికలాంగుల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వికలాంగుల సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేశారు.

జనసేన ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ

టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పుట్టిన రోజు సందర్భంగా ఎర్రగొండపాలెం జనసేన మండల అధ్యక్షుడు ఆకుల వెంకట రమేష్ ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకొని నిరంతరం వారి సమస్యలపై పోరాడుతున్న నేత ఎరిక్షన్ బాబు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, బీసీ నాయకులు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఫేస్‌బుక్‌లో ఫొటో మార్ఫింగ్ చేసిన వ్యక్తి అరెస్టు

గిద్దలూరు టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళ ఫొటోలను మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తిని గుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. ఆ వ్యక్తిది గిద్దలూరు మండలం కేఎస్‌పల్లె గ్రామవాసిగా గుర్తించారు. మహిళల ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు రావడంతో గుంటూరు జిల్లా పట్టాభిపురం పోలీసులు విచారణ చేపట్టారు. గిద్దలూరు మండలం కెఎస్ పల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి మధుసూదన్‌రెడ్డిగా గుర్తించి పోలీసులు అతడిని అరెస్టు చేశారు.



గుంటూరులో పోలీసుల అదుపులో ఉన్న గిద్దలూరు వాసి

పాతకక్షలతో గొడ్డలితో దాడి

● బాధితుడిని ఒంగోలుకు తరలింపు

బేస్తవారపేట,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూసలపాడు గ్రామంలో పాతకక్షలు దృష్టిలో పెట్టుకొని ఆదివారం గొడ్డలితో దాడి జరిగింది. జరిగిన ఈదాడి తీవ్రంగా గాయపడిన వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. పూసలపాడు గ్రామానికి చెందిన బొగ్గు చిన్న రంగయ్యపై ఆదే గ్రామానికి చెందిన వడ్డె లాజర్ అనే వ్యక్తి గొడ్డలితో దాడి చేసి గాయపరిచారు. చేతికి తీవ్ర గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం రంగయ్యను ఒంగోలు తరలించారు. వీరిద్దరికి గతంలో పాత కక్షలు ఉండటంతో ఈ దాడి జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కంభం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి కంభం పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో జరిగింది. కంభం సీఐ మల్లిఖార్జున కథనం ప్రకారం కంభం మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన ఆకాష్ (23) అనే యువకుడు మార్కాపురం నుంచి ద్విచక్రవాహనంలో కంభం వస్తుండగా పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా ఆకాష్ చింతకుంట్ల మాజీ సర్పంచ్ నాగయ్య కుమారుడిగా తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


తీవ్రంగా గాయపడిన ఆకాష్

విలువలతో కూడిన రాజకీయమే వెల్ఫేర్ పార్టీ లక్ష్యం

మార్కాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన రాజకీయాలు చేయడమే వెల్ఫేర్ పార్టీ లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షుడు కేఎం అబ్దుల్ సుభాన్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఆ పార్టీలో చేరిన పలువురికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ నేటి రాజకీయాలు పూర్తిగా అవినీతిమయంగా మారిపోయాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వెల్ఫేర్ పార్టీ పోటీ చేస్తుందన్నారు. అనంతరం మార్కాపురం పట్టణ కన్వీనర్‌గా షేక్ అబ్దుల్ రసూల్‌ను, కో కన్వీనర్లుగా షేక్ ఖాజా, షేక్ మస్తాన్‌వలిలను నియమించారు.

దుస్తుల పంపిణీ

పొదిలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్‌ను పురస్కరించుకొని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో బోధకులకు కరస్పాండెంట్ జోసెఫ్ దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ నాయకులు కిషోర్‌కుమార్, జ్ఞానసుందరరావు, జాన్ విక్టర్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దర్శిలో విద్యుత్ అదాలత్

దర్శి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దర్శిలో ఈనెల 9న డివిజన్‌స్థాయి లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. విజయవాడకు చెందిన ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో వినియోగదారులకు విద్యుత్ వాడకంపై అవగాహన కార్యక్రమం కూడా నిర్వహిస్తారని ఆయన తెలిపారు. దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు, పొదిలి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

కేజీబీవీని సందర్శించిన డీఎంహెచ్‌వో

ముండ్లమూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) ఆదివారం డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులవల్ల సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు, జ్వరాలు వస్తుంటాయన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విద్యార్థినులు ప్రతి రోజు శుభ్రంగా ఉండాలన్నారు. తాగునీరు సరఫరా, మురుగు దొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయనవెంట వైద్యాధికారి జాస్మిన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

భవనరంగ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

దర్శి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): భవన రంగ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. దర్శిలో ఆదివారం జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 25 లక్షల మంది ఈ వృత్తిలో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఎన్నోపోరాటాలతో ఏర్పడిన సంక్షేమ బోర్డును గత వైసీపీ ప్రభుత్వం మూసివేసిందని విమర్శించారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజాప్రభుత్వం బోర్డును పునఃప్రారంభించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దాసరి మల్లికార్జున, జె.కోటేశ్వర రావు, మస్తాన్‌రావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాసరావు

తాళ్లూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవోగా గ్రామ, వార్డు సచివాలయ డిప్యూటీ ఎంపీడీవో వంకాయల పాటి శ్రీనివాసరావును నియమిస్తూ ఎంపీడీవో పి.అజిత ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవలే గ్రామసచివాలయ, వార్డులకు నూతనంగా డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావును నియమించారు. పర్చూరు మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ జీఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొంది తాళ్లూరు మండలానికి వచ్చారు. ప్రస్తుతం డిప్యూటీ ఎంపీడీవోగా ఉన్న తూర్పుగంగవరం పంచాయతీ కార్యదర్శి నాగమల్లేశ్వరి మూడు పంచాయతీలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. పనిభారం అధికంగా ఉండటంతో జీఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావును ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవోగా నియమిస్తూ ఎంపీడీవో ఉత్తర్వులు జారీ చేశారు.

రథోత్సవంలో పాల్గొన్న దేవకి



శ్రీశైలంలో నాగసాధువులతో కలసి స్వర్ణ రథోత్సవంలో పాల్గొన్న దేవకి

కనిగిరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లన్న బంగారు రథోత్సవంలో వాసవీసత్ర సముదాయాల జాతీయ చైర్మన్, శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శివునికి నిర్వహించే విశేష పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామికి దేవకి వెంకటేశ్వర్లు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. వేకువజామున స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామివారిని మాడవీధుల్లో అత్యంత ఘనంగా నిర్వహించిన స్వర్ణ రథోత్సవంలో నాగసాధువులు, ఆలయ ట్రస్ట్ కమిటీ ఏవీ రమణ, వేమిరెడ్డి కోటారెడ్డితో కలసి దేవకి పాల్గొన్నారు.

'స్క్రబ్ టైఫస్'పై భయాందోళన చెందొద్దు!

» పెదఉల్లగల్లులో 3కు చేరిన బాధితులు



రోగులను పరామర్శిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు

ముండ్లమూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధి బాధితులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పెదఉల్లగల్లు గ్రామానికి చెందిన బొట్ల తిరుపతమ్మ స్క్రబ్ టైఫస్ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఆయన ఆదివారం గ్రామాన్ని సందర్శించారు. ఈనెల 4న తిరుపతమ్మ ఒంటిపై ఒక నల్లటి మచ్చ రావటంతో అనుమానం వచ్చి స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల్లో స్క్రబ్ టైఫస్‌గా నిర్ధారణ అయింది. అదే గ్రామంలో గత నెలలో కామన్ ఆదిలక్ష్మి, గుర్రం ఆదిలక్ష్మి ఈవ్యాధి లక్షణాలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. వారి రిపోర్టులు కూడా డీఎంహెచ్‌వో పరిశీలించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవ్యాధిగ్రస్థులు భయపడొద్దన్నారు. వారం రోజుల పాటు మందులు వాడితే తగ్గుతుందన్నారు. పూర్వం రోజుల్లో నులక మంచాల్లో నల్లి కుడితే ఇలా వస్తుందన్నారు. ప్రస్తుతం స్క్రబ్ టైఫస్‌గా వాడుకలోకి వచ్చిందన్నారు. గ్రామంలో ఇంటింటికి సర్వే చేపట్టాలని వైద్యాధికారులు ఎం.జాస్మిన్, జె.వెంకటేశ్వర్‌రెడ్డిలను ఆదేశించారు. అనుమానం ఉన్నవారి రక్తనమూనాలు సేకరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 14 మంది స్క్రబ్ టైఫస్ వ్యాధికి గురయ్యారని చెప్పారు.

ప్రధానంగా ఈవ్యాధి రావటానికి పొలం మేతకు వెళ్ళి గడ్డి కోస్తుంటే అందులో ఉన్న పురుగు కుట్టడం వల్లే వస్తుందని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు తెలిపారు. అలాంటి వారందరూ ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకుముందు ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా వైద్యులకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

అధ్వానంగా తాళ్లూరు- వెల్లంపల్లి రోడ్డు

» ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

» మరమ్మతుల గురించి పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



తాళ్లూరు- వెల్లంపల్లి మార్గంలో గుంతలమయంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

తాళ్లూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు-వెల్లంపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. గుంతల రోడ్డులో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాళ్లూరు నుంచి వెల్లంపల్లి 18 కిలోమీటర్లు ఉంటుంది. గత టీడీపీ ప్రభుత్వంలో సింగిల్ రోడ్డును డబుల్‌రోడ్డుగా ఏర్పాటుచేశారు. దీంతో వాహనాల రద్దీ పెరిగింది. ముండ్లమూరు గ్రామాల ప్రజలు కూడా తాళ్లూరు మీదుగా ఒంగోలుకు రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు గుంటూరు, విజయవాడకు వెళ్లేందుకు వెల్లంపల్లి వద్ద హైవేరోడ్డు వరకు ఈమార్గం గుండానే వెళుతుంటారు.

తాళ్లూరు నుంచి వెల్లంపల్లి వరకు 8ఏళ్ల క్రితంవేసిన ఆర్‌అండ్‌బీ రోడ్డు అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిల్వఉండి వాహన రాకపోకలతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈమార్గం గుండా ప్రయాణించాలంటే ప్రజలు భయ పడుతున్నారు. ద్విచక్రవాహనదారులకు రాత్రి సమయంలో గుంతలు కన్పించక పడి ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. తాళ్లూరు నుంచి నిత్యం ఒంగోలుకు కార్యాలయాల పనుల నిమిత్తం, వ్యాపారాల నిమిత్తం అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతలు పడ్డా సంబంధిత అధికారులు మరమ్మతులు జరిపిన దాఖలాలు లేవు. కనీసం ఒక గుంతకూడా పూడ్చక పోవటంతో ప్రజలు ఆశాఖ అధికారుల తీరును విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చించి ప్రయాణికుల కష్టాలను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రహదారిని కమ్మేసిన పొగమంచు

దొనకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): దొనకొండ నుంచి త్రిపురాంతకం వెళ్లే రహదారిని పొగమంచు కమ్మేసింది. దట్టమైన పొగమంచుతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనపడకపోవడంతో ఇబ్బందులుపడ్డారు. తెల్లవారుజాము నుంచి పొగమంచు అధికంగా కురవటంతో పాటు చలిగాలి సహితం అధికమవ్వటంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు.

దొనకొండ - త్రిపురాంతకం రహదారిని కమ్మేసిన పొగమంచు

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి చల్లగా చూడమని వేడుకున్నారు. తాళ్లూరుతో పాటు వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావటంతో ప్రాంగణం సందడిగా మారింది. గంగమ్మ తల్లిని అధికసంఖ్యలో భక్తులు దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. పలువురు కుంకుమ పూజలు నిర్వహించారు. వాహనదారులు వాహనపూజలు చేయించుకున్నారు.

ఆలయ అర్చకపూజారి ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్ర నామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులుపూజలు నిర్వహించారు. ఆలయ అన్నదాన సత్రంలో భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, ఆర్పీ ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

మిరప, బొప్పాయికి తెగుళ్లు

» ఆందోళన చెందుతున్న రైతులు

» నివారణకు అధికంగా మందులు వాడకం

» అదుపులోకి రాకపోవటంతో తోటలను తొలగిస్తున్న వైనం



పసుపుగల్లులో బొప్పాయి తోటకు సోకిన పండు తెగులు

ముండ్లమూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పంటలకు తెగుళ్లు సోకాయి. వీటి నివారణకు పురుగు మందులు పిచికారి చేసినా అదుపులోకి రావటంలేదు. తెగుళ్ళు వ్యాప్తి చెందటంతో పంటలు ఎదుగుదల లోపించి దిగుబడి వచ్చే అవకాశాలు లేక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు వురు పంటలను తొలగిస్తున్నారు.

మండలంలోని ఈ ఏడాది మిరప, బొప్పాయితో పాటు వివిధరకాల పంటలు సాగు చేశారు. మిరపకు బొబ్బర, ఎర్రనల్లి సోకాయి. ప్రస్తుతం ముమ్మరంగా పూత, పిందె దశలో ఉండగా ఒక్కసారిగా తెగుళ్ళు వ్యాప్తి చెందటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలం లో ఖరీఫ్‌లో 1637 ఎకరాలు, రబీలో 390 ఎకరాలు మిరప సాగు చేశారు. ఇప్పటికే ఎకరానికి రూ.50 వేలు వరకు పెట్టుబడి పెట్టారు. గత 20 రోజుల నుంచి తెగుళ్ల విస్తృతంగా వ్యాపించాయి. తెగుళ్ళు సోకిన మిర్చి తోటల పెరుగుదల లోపించింది. కొంత ఎర్రనల్లి వల్ల కొమ్మలు ఎండి పోవటం, చెట్టు మొదలు కుళ్ళి పోవటం లాంటివి వల్ల రైతులకు ఎంతో నష్టం చేకూరింది.

మండలంలో పసుపుగల్లు, శంకరాపురం, సింగనపాలెం, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లి, తమ్మలూరు గ్రామాల్లో 120 ఎకరాల్లో బొప్పాయి పంట సాగు చేశారు. ప్రస్తుతం ఈ తోటలకు పండు ఈగ తెగులు సోకింది. చెట్లు పండాకు రంగులో ఏర్పడి కుళ్ళిపోతున్నాయి. పిందెలు రాలిపోతున్నాయి. దీంతో బొప్పాయి తోటల రైతులకు నష్టాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను రైతులు కలసి పంటలకు సోకిన తెగుళ్ళను వివరించి వారి చెప్పిన మందులు వాడినా ఏమాత్రం ఉపయోగం లేకుండాపోయింది. ఇప్పటికే బొప్పాయి సాగు కు ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. తెగుళ్ళ వల్ల తోటలు ఎదుగుదల లోపించటంతో దిగుబడి రాదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో సాగుచేసిన రైతులు తెగుళ్ళను నివారించలేక పంటలను తొలగిస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రైతులు సరాసరి రూ.50 వేలకుపైగా పెట్టుబడి పెట్టి కూడా దున్నివేయటంతో తీవ్రనష్టం వాటిల్లింది.



తమ్మలూరులో మిరపకు సోకిన బొప్పర తెగులు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- ఏ.తిరుమలరావు, ఏవో

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు సూచించారు. మిరపలో బొబ్బర తెగులు నివారణకు ఫ్లూర్ బోరర్ పొక్లం వంద గ్రాములు ఒక ఎకరానికి చొప్పున, ట్రేజర్ 60 మిల్లీ లీటర్లు ఒక ఎకరానికి, కోరోజన్ 60 మిల్లీ లీటర్లు ఒక ఎకరానికి చొప్పున పిచికారి చేయాలన్నారు. తద్వార బొబ్బర, ఎర్రనల్లి, వేరు కుళ్ళు తెగులును నివారించవచ్చునని చెప్పారు. బొప్పాయిలో పండు ఈగ తెగులు నివారణకు పాడైన పండ్ల తొలగింపు, రంధ్రాలు ఉన్న పండ్లు, కుళ్ళి పండ్లు వెంటనే సేకరించి మట్టిలో రెండు మూడు అడుగుల లోతులో పాతి పెట్టాలి. లేదా ప్లాస్టిక్ కవర్లలో కట్టి నాశనం చేయాలి. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ తెగుళ్ల నివారించుకోవాలని రైతులకు సూచించారు.

పారిశుధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు

» మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేప డుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. పట్టణంలోని 5వవార్డులో ఆదివారం డ్రైనేజీ కాలువల నిర్మాణానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్, సీనియర్ నాయకుడు పుల్లారెడ్డితో కలసి చైర్మన్ గఫార్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా గఫార్, ఫిరోజ్‌లు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 5వ వార్డులో డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కనిగిరి పట్టణంలో అవసరమైనచోట డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లను నిర్మించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వచ్చే వేసవిలో ఎలాంటి నీటి ఇక్కట్లు ప్రజలకు లేకుండా చేసేందుకు కార్యాచరణ ప్రారంభించినట్లు తెలిపారు. కనిగిరి నగర పంచాయతీ 20 వార్డుల నుంచి 28 వార్డులుగా రూపాంతరం చెందగా, అదిశగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ హెచ్‌ఎంపాడు మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), మాజీ ఎంపీపీ సంబుల వెంకటేశ్వర్లు, ఏనుగు శ్రీనివాసులురెడ్డి, మాల్యాద్రి, ప్రతాప్, మోహన్, మురళి, నాగ, తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ కాలువల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న చైర్మన్, టీడీపీ నేతలు

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

పీసీపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగమ్మగుడి వద్ద శనివారం రాత్రి జరిగిన దొంగతనం కలకలం రేపింది. డాలి ప్యాకెట్లు కావాలని అడిగి వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును ఇద్దరు గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లిన ఘటన శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళాపురం గ్రామానికి చెందిన బోయిన వెంకటసుబ్బయ్య, ఆదిలక్ష్మమ్మ దంపతులు కొన్నేళ్లుగా గంగమ్మగుడి ఎదురుగా బడ్డీకొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి డాలి ప్యాకెట్ కావాలని అడిగారు. ఆమె ప్యాకెట్ అందిస్తున్న సమయంలో మెడలో ఉన్న నాలుగు సవర్ల బంగారు గొలుసును దుండగులు లాక్కొని బైకుపై పరారయ్యారు. షాక్‌కు గురైన వృద్ధురాలు వెంటనే కుటుంబ సభ్యులకు వివరాలు తెలియజేసింది. బాధితురాలు ఆదిలక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగలను గుర్తించేందుకు సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు.

ఘనంగా సాయి పూర్ణాహుతి మహాయజ్ఞం



బాబా పారాయణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాతాజీ, మాజీమంత్రులు ముక్కు కాశిరెడ్డి, మహీధర్ రెడ్డి

కనిగిరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సాయి పూర్ణాహుతి మహాయజ్ఞం ఆదివారం మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి నివాసంలో ఘనంగా జరిగింది. ఈసందర్భంగా మాజీమంత్రులు ముక్కు కాశిరెడ్డి, మానుగుంట మహీధర్ రెడ్డి సతీసమేతంగా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని మహాయజ్ఞ క్రతువులు నిర్వహించారు. శ్రీవిజయకిశోర్‌చే రచించబడిన శ్రీసాయిమహాసమాధి పుస్తకాన్ని మాతాజి శ్రీగురు విశుద్ధానంద భారతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం మాతాజి సత్సంగ కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ వితరణ, ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో శ్రీశుద్ధ చైతన్యానంద స్వామి, కేటీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి, బాబా దేవస్థానం తాజా, మాజీ అధ్యక్షులు కొప్పరపు సత్యాలు, దేవకి సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, గాయం బలరాంరెడ్డి దంపతులు, సింగరాజు మాలకొండేశ్వరరావు, నాగేశ్వరరెడ్డి, అంకయ్య స్వామి, బ్రహ్మయ్యస్వామి, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నారాయణస్వామికి పూజలు

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి మూలవిరాట్‌కు కుంకుమార్చన పూజలు, అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలు తొడిగి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ గాలిగోపురం వద్ద నుంచి నైవేద్యాన్ని మేళతాళాలతో ప్రదక్షిణ చేసుకుంటూ స్వామివారికి సమర్పించారు. అనంతరం గోశాలలోని గోమాతకు పసుపు, కుంకుమాలతో పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా దేవస్థాన ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్, ఈవో నరసింహబాబు, చావా సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

గురప్ప గుడిలో..

పామూరు, డిసెంబరు, 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో గల శ్రీగురప్ప దేవస్థానంలో అర్చకులు నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివునికి, నందీశ్వరునికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పాములపాటి మాధవప్రసాద్ కుటుంబసభ్యులు, మేడసాని గిరిప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి..

ముండ్లమూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని వీరభద్రస్వామికి నెల పొంగళ్ళు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అలాగే, ముండ్లమూరులోని పోలేరమ్మ, బొప్పుడివారిపాలెం పోలేరమ్మ, నూజెండ్లపల్లి పోలేరమ్మ, పోలారం, మారెళ్ళ, పసుపుగల్లు, కెల్లంపల్లి, ఈదర గ్రామాల్లో వేంచేసి ఉన్న పోలేరమ్మ, అంకమ్మ అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ చేసి పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించారు.

ప్రశాంత వాతావరణంలో కలసిమెలసి ఉండాలి




గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ రామారావు

ముండ్లమూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో కలసిమెలసి ఉండాలని సీఐ వై.రామారావు అన్నారు. మండలంలోని పులిపాడు గ్రామంలో శనివారం రాత్రి ఆయన పల్లెనిద్ర చేపట్టారు. ఈసందర్భంగా గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలందరూ కలసి మెలసి జీవించాలన్నారు. చిన్నచిన్న విషయాలకు గొడవలు పడి పోలీసు స్టేషన్‌ల వరకు రావద్దన్నారు. ఏదైనా సమస్య ఉంటే అందరూ కూర్చొని గ్రామంలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. వాహన చోదకుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. ఆదివారం తెల్లవారుజామున ముండ్లమూరు పోలీసుస్టేషన్ ఎదుట వాహనాలు ఆపారు. నిద్రమత్తులో ఉన్న డ్రైవర్లకు ముఖాలను నీటితో కడుక్కొనే విధంగా అవగాహన కల్పించారు. డ్రైవర్లకు నిద్రవస్తే రహదారుల పక్కన వాహనాలను ఆపి విశ్రాంతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పీవీ హనుమంతరావు, హెడ్‌కానిస్టేబుళ్ళు కృష్ణ దాసు, అంకారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

తాళ్లూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధిగాంచిన శ్రీగుంటి గంగాభవానీ ఆలయట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఈవో వాసుబాబు ఆదివారం తెలిపారు. జిల్లా దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం శ్రీగుంటి గంగాభవానీ ఆలయట్రస్ట్ బోర్డు నియామకం చేపట్టేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఏపీ ధార్మిక పరిషత్ ద్వారా ట్రస్ట్ బోర్డు నియామకం జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు దరఖాస్తులను 20 రోజులులోగా ఏపీ ధార్మిక పరిషత్‌కు అందజేయాలన్నారు.



మహా.. రుద్రాభిషేకం

కోటప్పకొండ(నరసరావుపేట), డిసెంబరు 7: ఆరుద్రోత్సవం సందర్భంగా కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామికి మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకాలు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు నేత్రపర్వంగా జరిగాయి. ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, విభూది, గంధం, కుంకుమ, తైలం, సుగంధ ద్రవ్యాలు, ఫలాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామికి అన్నాభిషేకం వైభవంగా జరిగింది. పాతకోటేశ్వర స్వామి దేవాలయం వద్ద అర్ధరాత్రి కర్పూర జ్యోతి దర్శనం చేసుకుని భక్తులు పులకించారు. ఉదయం యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్ర, శాంతి, వాస్తు హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. జ్యోతి దర్శనం అనంతరం మేధా దక్షణామూర్తి స్వాములు దీక్ష విరమించారు.



పాలాభిషేకం | పెరుగుతో.. | నెయ్యితో.. | పసుపుతో.. | కుంకుమతో.. | విభూదితో.. | గంధంతో.. | చెక్కరతో.. | అన్నాభిషేకం | శ్రీ పాత కోటేశ్వర స్వామి మూలవిరాట్‌కు విశేష అలంకారం

ఆదివారం.. ఆనందం.. ఆహ్లాదం

1 బాపట్లలో ఉత్సాహంగా హ్యాపీసండే



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

బాపట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివారం.. ఆనందం.. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ఒక చోట చేరి ఆహ్లాదంగా గడిపారు. హ్యాపీసండే పేరుతో బాపట్ల రథంబజారులో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారుల నృత్యప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కుటుంబ సభ్యులతో కలిసి వారాంతాన్ని సంతోషంగా గడపడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిందని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణ భట్టు, ఎండి.సాధిక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, నాటక అకాడమి కార్పొరేషన్ సభ్యులు మందపాటి ఆంద్రేయ, బూర్లె రామ సుబ్బారావు, తూర్పుసత్రం చైర్మన్ గుంటుపల్లి తులసీకుమారి, జి.గిరిజారాణి తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ దర్శన్ దిశగా అడుగులు

1 సూర్యలంకలో శరవేగంగా పనులు

బాపట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక పర్యాటక కేంద్ర అభివృద్ధికి స్వదేశీ దర్శన్ పేరుతో చేపట్టిన పనులు ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం రూ.97.52 కోట్లు కేటాయించగా టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు పనులు ప్రారంభించారు. సూర్యలంక సముద్రం ఎదురు ఉన్న దుకాణాల పక్కనే కాటేజీల నిర్మాణ పనులు చేపట్టారు. ఆదర్శనగర్ దగ్గర పేరలి డ్రెయిన్ సముద్రంలో కలిసే వరకు హౌస్ బోట్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్నారు. హరితా బీచ్ రిసార్ట్స్ వద్ద రూ.7.50 కోట్లతో అధునాతన హంగులతో 10 కాటేజీలు, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణ పనులు చేస్తున్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చొరవ తీసుకుని ఆక్రమిత భూములను సైతం స్వాధీనం చేసుకుని చెరువులు, ముళ్లపొదలతో ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసి పర్యాటక ప్రాజెక్టుకు సిద్ధం చేశారు. ఆయా పనులతో చుట్టు పక్కల ఉన్న ప్రైవేట్ భూములను కూడా యజమానులు అభివృద్ధి చేస్తున్నారు. లేఅవుట్లు, హోటళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.



సూర్యలంకలో ప్రారంభమైన పర్యాటక ప్రాజెక్ట్ పనులు

హోర్డింగ్‌లతో.. హడల్

1 ప్రమాదకరంగా ప్రకటనల బోర్డులు

1 పట్టణాల్లో అనుమతి లేకుండా ఏర్పాటు
1 ఆదాయాలు కోల్పోతున్నా పట్టని మున్సిపాల్టీలు
1 నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడంటే అక్కడ ఏర్పాటు
1 ప్రకటనలకే పరిమితమైన జరిమానా, చర్యల హెచ్చరికలు

పదుల అడుగుల ఎత్తులో వేలాడున్న హోర్డింగ్‌లు హడలెత్తిస్తున్నాయి. ప్రమాదకరంగా ఉన్న బోర్డులు ఎప్పుడు ఎవరిపై పడతాయోనని ప్రజలు భీతిల్లిపోతున్నారు. విద్య, వ్యాపార కేంద్రాలైన గుంటూరు నగరంతో పాటు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో హోర్డింగ్‌లకు డిమాండ్ ఉంది. ఇదే అవకాశంగా పలువురు అనధికారికంగా హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. మున్సిపాల్టీల అనుమతి తీసుకుంటే ప్రత్యేకంగా చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అలా చార్జీలు చెల్లించకుండా అధికారులకు మామూళ్లు సమర్పించుకుని ఎక్కడంటే అక్కడ ఎలాగంటే అలాగ.. నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేస్తున్న వ్యాపార ప్రకటనల బోర్డులు ప్రమాదాలకు నెలవుగా ఉంటున్నాయి. వర్షాలు, గాలుల సమయంలో బోర్డులు పడిపోయి పలువురు గాయపడుతున్నా, అధికారులతో పాటు హోర్డింగ్‌ల నిర్వాహకులకు పట్టడంలేదు.

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

మున్సిపల్ పట్టణాలు, గుంటూరు నగర పరిధిలో విద్య, వాణిజ్య ప్రకటనల బోర్డులకు పెద్దఎత్తున డిమాండ్ ఉంది. దీంతో మున్సిపల్, ప్రభుత్వ స్థలాలతో పాటు రోడ్లు, డ్రెయిన్లు ఆక్రమించి విచ్చలవిడిగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. డివైడర్లపై, రోడ్ల మలుపుల్లో తక్కువ ఎత్తులో ఏర్పాటు చేస్తున్న ప్రకటనల బోర్డులతో ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. కొందరు దళారులు సిండికేట్‌గా మారి అధికారులను మామూళ్లతో లోబరుచుకుని ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రైవేటు భవనాలపై అనధికార హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి అందిన కాడికి దండుకుంటున్నారు. ప్రకటనల బోర్డులతో యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు రూ.లక్షల్లో అక్రమంగా సంపాదిస్తుండగా అందులో టౌన్‌ప్లానింగ్ అధికారులకు భారీగా ముడుపులు ముడుతున్నట్లు ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకరంగా ఏర్పాటు చేస్తున్న హోర్డింగ్‌లతో ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్ల మధ్య, జంక్షన్లలో భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదనే నిబంధన ఉన్నా ఎవరికీ (మిగతా 8లో)

ఆంధ్రజ్యోతి ఫోకస్

జేబులు నింపుతున్నాయి

హోర్డింగ్‌లు.. ప్రకటనల బోర్డులు.. స్థానిక సంస్థ ఖజానాలను నింపాలి. కానీ కొంతమంది అధికారుల జేబులు నింపుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా.. ప్రమాదకరంగా.. ఎక్కడంటే అక్కడ భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నా అధికారులకు పట్టడంలేదు. పదుల సంఖ్యలో అనుమతులు తీసుకుని వందల సంఖ్యలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నా అడిగే నాథుడు లేడు. రూపాయి కూడా చెల్లించకుండా రోడ్ల మార్జిన్లలో, షాపుల ముందు, డివైడర్ల మధ్యలో, జంక్షన్లలో ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.



అద్దె భవనాల్లోనే.. ఆఫీసులు

మూడున్నరేళ్లు దాటినా వీడని కష్టాలు
అరకొర వసతుల మధ్య ఉద్యోగుల అవస్థలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఇరుకు గదుల్లోనే జిల్లా కార్యాలయాలు.. జిల్లా అధికారుల నియామకాలు లేవు.. అరకొర వసతుల మధ్య ఉద్యోగుల అవస్థలు.. కొత్త జిల్లా ఏర్పాటుతో పరిపాలన అందుబాటులోకి వస్తుందని ఆశ పడిన ప్రజలు పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదీ మూడున్నరేళ్లుగా జిల్లాలోని పరిస్థితి. బాపట్ల జిల్లా ఆవిర్భవించి మూడున్నరేళ్లు గడిచినా పరిపాలన ఇంకా గాడిలో పడలేదు. వైసీపీ ప్రభుత్వం జిల్లా ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. కనీస వసతులు కల్పించడాన్ని విస్మరించింది. పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరగడం లేదు. ఆఫీసుల్లో కనీస వసతులు లేక ఉద్యోగులు.. ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న కార్యాలయాలకు ప్రభుత్వం చెల్లిస్తున్న అద్దె చాలక సొంతంగా చెల్లించాల్సిన దుస్థితిని అధికారులు ఎదుర్కొంటున్నారు. కలెక్టరేట్, పోలీసు కార్యాలయం, కలెక్టర్, ఎస్పీ నివాసాలకే వసతులు పరిమితమయ్యాయి. కొన్ని కార్యాలయాలకు నేటికి కనీసం ఫర్నీచర్ కూడా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో పరిస్థితులు మెరుగుపడతాయని అధికార యంత్రాంగం, ప్రజలు ఆశించారు. అయితే ఏడాదిన్నర గడిచినా జిల్లా కేంద్రంపై దృష్టి సారించలేదు. గత ప్రభుత్వం జిల్లా అధికారుల పోస్టులను మంజూరు చేసినా నియామకాలను విస్మరించింది. సమీకృత కలెక్టరేట్ పేరిట గత ప్రభుత్వం చేసిన హడావిడి ప్రకటనలకే పరిమితమైంది తప్ప పట్టాలెక్కలేదు. ఓ ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన కళాశాల భవనంలో కీలకమైన వ్యవసాయ, విద్యా, సహకార, బీసీ కార్పొరేషన్ లాంటి విభాగాలు అక్కడే కొనసాగుతున్నాయి. నెలల తరబడి అద్దె కూడా చెల్లించడం లేదని సమాచారం. మైనింగ్, ఫారెస్ట్, మార్క్‌ఫెడ్, ఫుడ్ సేఫ్టీ, ఉద్యాన విభాగాలు ప్రైవేటు భవనాల్లో అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. కార్యాలయాల అద్దె భవనాల సంగతి ఇలా ఉంటే కీలక శాఖలకు ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. డీఆర్‌డీఏ, పర్యాటక, అటవీ ఇలా దాదాపు పది విభాగాలకు అదనపు బాధ్యతలతో నెట్టుకు రావడంతో పాలనలో వేగం కనబడడం లేదు. ఇంకా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొన్ని విభాగాలు కొనసాగుతుండడంతో పాటు ఖాతాల విభజన కూడా జరగకపోవడంతో స్టేషనరీ ఖర్చులకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. సమీకృత కలెక్టరేట్ నిర్మాణానికి సంబంధించి రెండు మూడు చోట్ల స్థల ఎంపికలు చేసిన ప్రతిపాదనలను వెంకటమురళి కలెక్టర్‌గా ఉన్నప్పుడే పంపారు. వాటిపై ఏ విషయం ఇంతవరకూ తేల్చలేదు. ఏ విభాగాల్లో ఎన్ని పోస్టులు ఖాళీలు ఉన్నాయనే అంశంతో పాటు, ఇన్‌చార్జి బాధ్యతల్లో ఎంతమంది ఉన్నారు, తక్షణం భర్తీ చేయాల్సిన పోస్టులు ఇలా సవివర నివేదికలను ఇప్పటి కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రభుత్వానికి నివేదించినట్లు తెలుస్తోంది.



ఓ కళాశాల సొసైటీ భవనంలో కొనసాగుతున్న సమగ్ర శిక్షా కార్యాలయం

ఏడుకు చేరిన..

స్క్రబ్ టైఫస్ కేసులు

ఇటీవల బాపట్లకు చెందిన మహిళ మృతి

బాపట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిన్న పురుగు ద్వారా వ్యాప్తి చెందే స్క్రబ్ టైఫస్ వ్యాధి జిల్లాను వణికిస్తోన్నది. గతంలో నాలుగు కేసులు నమోదు కాగా తాజాగా పిట్టలవానిపాలెం మండలం దేగలవారిపాలెం, కర్లపాలెం మండలం, అమర్తలూరు మండలాల్లో మూడు కేసులు వెలుగుచూశాయి. ఇటీవల జీజీహెచ్‌లో ఈ వ్యాధి లక్షణాలతో బాపట్లకు చెందిన ఓ మహిళ మృతి చెందినట్లు సమాచారం. జిల్లాలో మొత్తం ఏడుగురికి స్క్రబ్ టైఫస్ లక్షణాలు గుర్తించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. శరీరంపై ఏదో పురుగు కుట్టిందని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఈ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చర్మంపై కాలినట్లు చిన్న మచ్చ, దద్దుర్లు ఏర్పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ చిన్న పురుగు కుట్టిన తర్వాత తలనొప్పి, జ్వరం, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలన్నారు. చిన్నకీటకమని నిర్లక్ష్యంచేస్తే ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

సంతృప్తిలో.. రెవెన్యూ లోటు

1 పీజీఆర్‌ఎస్‌కు అధికంగా రెవెన్యూ సమస్యలు 1 ఏళ్ల తరబడి తిరుగుతున్న బాధితులు 1 పరిష్కారం చూపని అధికారులు

నల్లపాడు శివారులోని గోర్రెల మండి వెనక సర్వే నెంబరు 554లో దుగ్గెంపూడి వెంకటప్పారెడ్డికి చెందిన రెండెకరాల భూమి ఉంది. అందులోని కొంతభాగం 15 ప్లాట్స్ వేసి విక్రయించారు. మిగిలిన భూమి సర్వే చేయమని అర్జీదారుడు కృష్ణారెడ్డి(వెంకటప్పారెడ్డి మనవడు) రెండేళ్లుగా పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు ఇస్తున్నా.. రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు.



- ఫిరంగిపురం మండలంలోని 113 తాళ్లూరుకు చెందిన దాసరి లలితకుమారి ఉపాధి కోసం కువైట్ కు వెళ్లి.. తిరిగొచ్చేసరికి తన ఇంటిని బంధువులు ఆక్రమించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆమె కొన్నేళ్లుగా ప్రతి సోమవారం పీజీఆర్‌ఎస్‌కు వచ్చి అర్జీ అందజేస్తున్నారు.
- ప్రత్తిపాడు మండలంలోని చినకోండ్రుపాడుకు చెందిన పంతగాని సంసోన్ అనే వ్యక్తి తన భూమిని ఒక రాజకీయ నాయకుడు ఆక్రమించుకొన్నాడని తహసీల్దార్, ఆర్‌డీవో, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు.
- పెదకాకాని మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో కడప స్వర్ణకుమారి తన 498 చదరపు గజాల భూమిని రెవెన్యూ అధికారులు వ్యవసాయ భూమిగా మార్చి వేరే వాళ్లకు పట్టాలు ఇచ్చారని, దీనిపై తాను కొన్నేళ్ల నుంచి ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

చీరాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవియన్స్ రీడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్‌ఎస్)కి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి అర్జీదారుల ఫిర్యాదులను పరిష్కరించాలని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అయితే జిల్లాస్థాయిలో మాత్రం ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమం ఒక మొక్కుబడి తంతులా మారింది. ప్రతి అర్జీ పరిష్కారానికి నిర్దీత వ్యవధి ఉంది. నిబంధనల ప్రకారం పీజీఆర్‌ఎస్‌కు వచ్చే అర్జీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కరించాలి. అవి మళ్లీ రీఓపెన్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత విభాగాల అధికారులదే. గణాంకాల్లో అంతా సవ్యంగా ఉందని ప్రభుత్వానికి నివేదించడంపైనే అధికారులు ఎక్కువగా దృష్టి పెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అర్జీలను ఫిర్యాదిదారు సంతృప్తి మేరకు పరిష్కరించాలి. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అదే విషయాన్ని తెలియజేసి కంప్లయింట్‌ని సంబంధిత వ్యక్తి ఆమోదం తీసుకొని మూసేయాలి.

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

గ్రీవియన్స్ ఎక్కువగా (మిగతా 8లో)

37 బైక్‌లు స్వాధీనం.. ముగ్గురు అరెస్టు

బాపట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరుసగా ద్విచక్రవాహనాలను అపహరిస్తున్న ముఠా కార్యకలాపాలను ఎట్టకేలకు బాపట్ల సీసీఎస్ పోలీసులు కట్టడి చేశారు. చాకచాక్యంగా ముగ్గుర్ని అరెస్టు చేసి వారి నుంచి 37 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియా ఎదుట హాజరుపరిచిన ఎస్పీ బి.ఉమామహేశ్వర్ వివరాలను తెలిపారు. గుంటూరుకు చెందిన ఖగ్గా సాంబశివరావు, చీరాల బుర్లవారిపాలేనికి చెందిన దాసరి గోపిరాజు, దాసరి దుర్గారావు ఉమ్మడిగుంటూరు, ప్రకాశం, కృష్ణాజిల్లాల్లో బైక్‌లను అపహరించారు. బాపట్ల సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ ప్రేమయ్య సిబ్బందితో కలిసి రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి వరుస బైక్ దొంగతనం కేసులను చేధించారు. ఖగ్గా సాంబశివరావు లారీ డ్రైవర్‌గా పని చేస్తూ వ్యసనాలు, విలాసాలకు నగదు కోసం రెండేళ్లుగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. చీరాల ప్రాంతంలో చీపుర్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్న దాసరి గోపిరాజు, దుర్గారావులకు వచ్చే సంపాదన సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని ఆరునెలలుగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. గడిచిన వారం రోజుల్లో 60 బైక్‌లను రికవరి చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఇన్‌స్పెక్టర్ ప్రేమయ్య, సీఐలు ఆర్.రాంబాబు, సుబ్బారావు, ఎస్ఐ రాంబాబు, కానిస్టేబుళ్ళు కోటేశ్వరరెడ్డి, కృష్ణ, సురేష్, దాసు, చిరంజీవి, హోంగార్డ్ రవూఫ్‌లను ఎస్పీ అభినందించి క్యాష్ రివార్డులు అందజేశారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లు,దొంగలు గురించి తెలియజేస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

అవీ..ఇవీ..

సృజనాత్మకతను పెంచేందుకు వారోత్సవాలు



వారోత్సవాల్లో మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, యువకుల్లో సృజనాత్మకతను పెంచేందుకు యువజన వారోత్సవాలు దోహదపడతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రోటరీ కమ్యూనిటీ భవనంలో యువజన వారోత్సవాలు నిర్వహించారు. రోటరీక్లబ్, ఇన్నర్‌వీల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. మొదటి రోజు చెస్. డాన్స్ బేబీ డాన్స్ పోటీలు నిర్వహించగా 38 మంది సీనియర్స్, 36 మంది జూనియర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, వెంకటేశ్వరరావు, సురేష్‌బాబు, డా.ఐ.బాబురావు, సుభాషిణీ, కృష్ణమూర్తి, శంకరరెడ్డి, శ్రీనివాసరావు, పోలుదాసు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

13న మండల సర్వసభ్య సమావేశం

బల్లికురవ, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సర్వసభ్య సమావేశం ఈ నెల 13న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. గ్రామాలలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలుమూడు నెలల కాలంలో జరిగిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించనున్నట్లు అన్ని శాఖల అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

హిందూ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి


కార్యక్రమంలో పాల్గొన్న హిందూ సంఘాల ప్రతినిధులు

చీరాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21న స్థానిక ఎన్ఆర్అండ్ పీఎం స్కూల్ మైదానంలో నిర్వహించే హిందూ సమ్మేళనం జయప్రదం చేయాలని పలువురు కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో పలు సంఘాల కమిటీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ సమాజం పట్ల ప్రేమ, ఆత్మ గౌరవం, ఏకాత్మత పెంపొందించేందుకు తలపెట్టిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు హాజరై ఉపన్యసించనట్లు వివరించారు. ఈ క్రమంలో అవకాశాన్ని హిందూవాదులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాడివలస దేవరాజ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన మహిళ.. కేసు నమోదు


సరికొండ కొండమ్మ (ఫైల్)

పంగులూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బైట మంజులూరు గ్రామానికి చెందిన సరి కొండ కొండమ్మ (40)భర్త ఆదిరాజు కొద్దిరోజులుగా కనిపించడంలేదు. ఈ విషయమై రేణింగివరం పోలీస్ స్టేషన్లో శనివారం రాత్రి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదయింది. ఎస్.ఐ. వినోద్‌బాబు అందించిన సమాచారం మేరకు సరికొండ కొండమ్మకు మతి స్థిమితం లేదు. ఈ మహిళ ప్రతిరోజూ పగటిపూట గ్రామంలో తిరుగుతూ రాత్రి సమయానికి ఇంటికి చేరుకునేది. గత నెల 29న ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన కొండమ్మ రాత్రి పొద్దుపోయినా ఇంటికి చేరుకోలేదు. ఈ మహిళకు సంబంధించి ఆచూకీ తెలిసిన వారు స్థానిక ఎస్.ఐ. మొబైల్ నెంబరు 9121102152కు సమాచారం అందించాలని కోరారు.

హోర్డింగ్‌లతో.. హడల్

(5వ పేజీ తరువాయి)

పట్టడంలేదు. గుంటూరు నగరంతో పాటు పలు మున్సిపల్ పట్టణాల్లో ఎక్కడ చూసినా అనధికార హోర్డింగ్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి.

చర్యలపై స్పందన శూన్యం

అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న అక్రమ హోర్డింగ్‌లపై కౌన్సిల్ సమావేశాల్లో తరచూ చర్చలు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ పెద్దసంఖ్యలో ప్రకటనల బోర్డులు ఉంటున్నా ఆ మేరకు ఆదాయం లేకపోవడంపై పలువురు ప్రశ్నిస్తున్నా అధికారుల నుంచి సరైన స్పందన ఉండటంలేదన్న విమర్శలు వస్తున్నాయి. అనధికార, ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్‌లను తొలగిస్తామని, జరిమానా వసూలు చేస్తున్నామని సమాధానాలు చెప్పే అధికారులు ఆ తర్వాత వాటి గురించి పట్టించుకోవడంలేదు. బోర్డుల ఏర్పాటు చేసే సంస్థల నుంచి మామూళ్లే అధికారుల మౌనానికి కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. అనధికార హోర్డింగ్‌లకు రోజుకు 50 వేల చెప్పునా జరిమానా విధించాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను అధికారులు అమలు చేస్తారా అన్న విషయంపై సందేహం నెలకొంది. అనుమతులు తీసుకున్న హోర్డింగ్‌లు మాత్రమే లెక్కల్లో చూపించి మిగిలిన వాటి గురించి తమకేమి తెలియదన్నట్లు అధికారులు చోద్యం చూస్తుండటంపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. గుంటూరులో అధికారకంగా 6,250 ఉండగా అనధికారికంగా 2500 పైగా హోర్డింగ్‌లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిపై నగర పాలక సంస్థ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బాపట్లలో 52 ప్రాంతాల్లో హోర్డింగ్‌ల ఏర్పాటుకు 21 సంస్థలు అనుమతి పొందినా అనేకమంది పన్నులు చెల్లించడంలేదని అధికారులు చెప్పకనే చెబుతున్నారు. వీరికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. సూర్యలంక పరిసరప్రాంతాల్లో ఎక్కువగా అనధికార హోర్డింగ్‌లు ఉన్నట్లు తెలిసింది. రేపల్లె పట్టణంలో అనుమతి పొందిన హోర్డింగ్‌లు 20 ఉండగా అనధికార హోర్డింగ్‌లు పెద్దసంఖ్యలో ఉన్నాయి.

సంతృప్తిలో.. రెవెన్యూ లోటు

(5వ పేజీ తరువాయి)

వస్తోన్న జిల్లాల్లో గుంటూరు కూడా ఒకటిగా ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 57 మండలాలున్నప్పుడు ఎన్ని ఫిర్యాదులైతే వచ్చేవో విభజన జరిగిన తర్వాత కూడా అంతే స్థాయిలో వస్తున్నాయి. రెవెన్యూకి సంబంధించి మ్యుటేషన్లు, భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలు, రెవెన్యూ రికార్డులలో ఎంట్రీల కరెక్షన్స్, ల్యాండ్ పార్శిల్స్ విభజన, పట్టాదారు పాసు పుస్తకాల జారీలో జాప్యం, ఒకరి భూమిని మరొకరు ఆక్రమించడం వంటి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. వీటిపై దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా.. రెవెన్యూ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. మండల స్థాయిలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు గురై నాన్చుతున్నారు. కొన్ని ఫిర్యాదులను పరిష్కరించకుండానే క్లోజ్ చేసేస్తున్నారు. ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం గుంటూరు జిల్లాలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 20 వేలకు పైగా అర్జీలు అందాయి. దీని వలన పబ్లిక్ ఫీడ్ బ్యాక్‌లో సంతృప్తి శాతం 50 నుంచి 60 శాతం మధ్యనే ఉంటోంది. కలెక్టర్ తమీమ్ అన్సారియా బాధ్యతలు చేపట్టిన తర్వాత పీజీఆర్ఎస్‌లో కొన్ని మార్పులు తీసుకొచ్చారు. వాటి ఫలితాలు ఎలా ఉంటాయో కొద్ది రోజుల్లో తెలుస్తుంది.

మినీ బైపాస్ రోడ్డుకు వడివడిగా అడుగులు

● ఇళ్ల స్థలాల కేటాయింపు, సర్వే పూర్తి ● ముందుగా గ్రావెల్‌తో చదును చేసే పనులు


బైపాస్ రోడ్డు నిర్మాణానికి సిద్ధం చేసిన అద్దంకి మేజర్ కాలువ కట్టలు

అద్దంకి,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని నామ్ రోడ్డుపై కొంత మేర ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అద్దంకి మేజర్ కాలువ కట్టను మినీ బైపాస్‌గా మార్చే పనులకు అడుగులు ముందుకు పడుతున్నాయి. కాలువ కట్టలపై తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్న కుటుంబాలకు ఇళ్లస్థలాల కేటాయింపు పూర్తయ్యింది. అదే సమయంలో మొదటి దశలో మినీబైపాస్ నిర్మాణం జరిగే కాకానిపాలెం నుంచి శ్రీనగర్ వరకు సుమారు 1.5 కి.మీ దూరం 70 అడుగుల వెడల్పుతో కాలుకట్ట హద్దులను గుర్తిస్తూ సర్వే పూర్తి చేశారు. కాలువ కట్టలపై ఉన్న నివాసాలను కూడా ఈ నెల 20వ తేదీ లోపు స్వచ్ఛందంగా ఖాళీ చేసుకోవాలని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పటికే పలు కుటుంబాలు వెంటనే ఇళ్లు ఖాళీ చేసేందుకు సిద్ధం అవుతున్నాయి. సుమారు రూ.17 కోట్ల వ్యయంతో అద్దంకి మేజర్ కాలువకు రెండు వైపులా కట్టలను సీసీ రోడ్లుగా మా ర్చడం, మధ్యలో పంట పొలాలకు నీరు చేరేలా కాలువను ఉంచడం, సీసీ రోడ్ల పక్కన మురుగు కాలు వలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేసేలా డిజైన్ సిద్ధం చేశారు. ఈ క్రమంలో ముందు గా సర్వే చేసి హద్దులు నిర్ణయించిన వరకు మొత్తం వెడల్పుతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే ఇళ్లు లేకుండా ఖాళీగా ఉన్న చోట చెట్లు తొలగించి శుభ్రం చేశారు. రెండు, మూడు రోజులలో గ్రావెల్ పనులు ప్రారంభించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. రెండవ దశలో కాకానిపాలెం నుంచి టిడ్కో ఇళ్ల మీదుగా శింగరకొండ వరకు తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉంది.

గోతుల మయంగా డొంకదారులు

వ్యవసాయ పనులకు ఇబ్బంది పడుతున్న రైతులు


గోతులమయంగా ఉన్న పొలాలకు వెళ్లే డొంక

పంగులూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ గ్రామంలో నాగండ్ల వైపు వెళ్లే డొంక రహదారి గోతుల మయమైంది. గ్రామానికి ఆనుకుని ఉన్న సాగర్ మైనర్ కాలువ పక్కగా ఉత్తరం వైపు పొలాలకు వెళ్లే డొంకదారి ఛిద్రం అయ్యింది. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఇంచుమించు రెండు కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ డొంక కల్లంవారిపాలెం నుంచి నాగండ్ల వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో కలుస్తోంది. ఈ డొంకకు ఇరువైపులా బూదవాడ రైతులు వందల ఎకరాల్లో మిరప, మొక్కజొన్న తదితర పంటలు సాగుచేస్తున్నారు. నిత్యం పంట చేలల్లో పనులకు వెళ్లేందుకు రైతులు, వ్యవసాయ కూలీలు రాకపోకలు సాగిస్తుంటారు. కొన్ని సందర్భాలలో రాత్రివేళ పంట చేలను సాగర్ జలాలతో తడుపుకునేందుకు పొలాలకు రాకపోకలు సాగించడం కష్టంగా ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ డొంక రహదారికి తగిన మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

భూ వివాదం.. పరిష్కారం


చర్చల్లో పాల్గొన్న పెద్దలు, స్థానికులు

దేవాంగపురి (చీరాల), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం దేవాంగపురి వినాయకపురంలో కొంతకాలంగా నెలకొన్న గ్రామానికి చెందిన భూ వివాదానికి తెరపడింది. గ్రామానికి సంబంధించి సుమారు 35 సంవత్సరముల క్రితం బహిర్భూమి నిమిత్తం ఇతరుల నుంచి 1.75 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అయితే కాలక్రమేణ అది చిల్లచెట్లతో నిండింది. ఈ క్రమంలో రక్షణ చర్యల్లో భాగంగా దానికి సంబంధించి కొందరిని పర్యవేక్షకులుగా ఉంచారు. భూమి ధరలకు రెక్కలు రావడంతో కబ్జా చేసేందుకు పూనుకున్న కొందరు చదును చేసి ప్లాట్లు వేసుకుని సొమ్ము చేసుకునేందుకు పూనుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులంతా రోడ్డెక్కడంతో పలుమార్లు పంచాయతీ జరిగింది. ఎట్టకేలకు ఆదివారం గ్రామంలో జరిపిన చర్చల్లో భూమిని గ్రామస్థులకు తిరిగి అప్పగించేందుకు అన్యాక్రాంతానికి పూనుకున్న వారు అంగీకరించినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే సంబంధిత లావాదేవీల్లో జరిగిన ఖర్చును కూడా ప్రజలు తప్పని పరిస్థితుల్లో తిరిగి ఇచ్చేందుకు అంగీకరించినట్లు చెప్పారు. సోమవారం అందుకు సంబంధించి పెద్దల సమక్షంలో రాత పూర్వకంగా వ్యవహారం నిర్వహించనున్నారు. ఎట్టకేలకు సుదీర్ఘకాలంగా నెలకొన్న వివాదానికి తెరపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కనికరం కరువై.. రామాలయం చెంతకు వృద్ధురాలు

ముగ్గురు కుమార్తెలకు బరువైన పండుటాకు


రామాలయం వద్ద మంచంపైనే ఉన్న వృద్ధురాలు

మేదరమెట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక ప్రపంచం టెక్నాలజీతో అభివృద్ధివైపు సాగుతూ ఉంటే మానవత్వం మాత్రం రోజురోజుకు కనుమరుగై పోతోంది. కడుపున పుట్టిన బిడ్డలకు తల్లి భారమై పోయింది. కనీ, పెంచీ, వివాహాలు చేసి మంచీ చెడ్డా చూసుకున్న ఓ తల్లిని నడిరోడ్డుమీద వదిలేశారు. ఈ ఘటన కొరిశపాడు మండలం రావినూతలలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన నాగుబోయిన సుబ్బులు రామాలయం వద్ద దీనస్థితిలో మంచంపై ఉన్నది. ఈమె భర్త రత్తయ్య కొంత కాలం క్రితం మృతిచెందాడు. ఈమెకు ముగ్గురు కుమార్తెలున్నారు. వారిలో ఒక కుమార్తె రావినూతలలోనే ఉంటుంది. మరొకరు ధైవాలరావూరు, ఇంకొకరు టంగుటూరు మండలం జయవరంలో ఉంటున్నట్లు తెలిసింది. గత నాలుగు నెలలుగా ఈమె ఆ పంచనా.., ఈ పంచనా గ్రామస్థుల సహకారంతో కాలం వెళ్లబుచ్చింది. అయితే ముగ్గురు కుమార్తెలున్న ఈమెను మనం ఎంతకాలం చూస్తామని స్థానికులు రామాలయం వద్ద ఉంచారు. అనంతరం సుబ్బులు కుమార్తె వద్దకు వెళ్లి 'రేపు మిగిలిన ఇద్దరిని పిలిపించి మాట్లాడదాం.. ఈ రాత్రికి మీ వద్ద ఉంచుకో' అని చెప్పినా ఆమె ఏమైనా మాకు సంబంధం లేదు. మా ఇంటిలోనికి మాత్రం రానివ్వమని కరాఖండీగా చెప్పినట్లు తెలిసింది. దీంతో రాత్రి రామాలయం వద్దే ఉన్న ఆమె దీనావస్థ చూడలేక రాత్రి 10 గంటలకు మంచంపై చిన్న పరదా కట్టారు. ఈ ఘటనపై పలువురు పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని సమాచారం.

పురాతన నేలచప్టాల మరమ్మతులకు నిధులు

పనులు ప్రారంభించిన ప్రభుత్వం


చప్టాలను పగులగొడుతున్న యంత్రం


ప్రారంభమైన పనులు

బల్లికురవ, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పురాతన కాలం నాటి చప్టాలు కూలేందుకు సిద్ధంగా ఉండటంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం శిథిలావస్థకు చేరిన మూడు చప్టాలకు రూ.75 లక్షలను మంజురు చేసింది. బల్లికురవ మండల కేంద్రం నుండి ఎన్‌హెచ్ 5 రోడ్డులో కొణిదెన, నక్కబొక్కలపాడు గ్రామాల మధ్య గత కొంత కాలం నుండి మూడు చప్టాలు శిథిలావస్థకు చేరి ఉన్నాయి. అర్అండ్‌బి అధికారులు చప్టాల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు పోగా ప్రభుత్వం అర్జెంట్ మర్మత్తుల నిధులతో మూడు స్లాబు కల్వర్టుల నిర్మాణానికి ఒక్కో చప్టాకు రూ. 25 లక్షల చొప్పున నిధులను మంజురు చేసింది. ఆదివారం నుండి చప్టాల పనులు ప్రారంభం అయ్యాయి. దెబ్బతిన్న చప్టాల ప్రక్కనే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా డైవర్షన్ రోడ్డును కూడా ఏర్పాటు చేయిస్తున్నామని కాంట్రాక్టర్ చెరుకూరి అంజనేయులు తెలిపారు. త్వరిత గతిన చప్టాల పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అధికారుల దృష్టి

స్టాపర్ దిమ్మెలు, హెచ్చరిక బోర్డులు, బారికేడ్ల ఏర్పాటు


వాహనచోదకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బరాజు


శింగరకొండ సమీపంలో ఏర్పాటు చేయిస్తున్న స్టాపర్ దిమ్మెలు

అద్దంకి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ శనివారం సంతమాగులూరు మండలంలో రోడ్డుప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించారు. వెంటనే నామ్, కర్నూలు-గుంటూరు రోడ్లలో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలలో స్టాపర్ దిమ్మెలు, హెచ్చరిక బోర్డులు, బారికేడ్ల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. దీంతో కదిలిన పోలీస్ అధికారులు ఆదివారం పలు ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. ప్రధానంగా నామ్ రోడ్డు లో ఆదివారం అద్దంకి టౌన్ సర్కిల్ పరిధిలో చినకొత్తపల్లి క్రాస్ రోడ్డు, భవనాసి చెరువు, 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం, కాకానిపాలెం హైస్కూల్, కలవకూరు రోడ్డు, భవానిసెంటర్లతో పాటు దర్శి రోడ్డులో ఏర్పాటు చేశారు. రామ్‌నగర్, కొంగపాడు క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాలలో కూడా ఏర్పాటు చేయనున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. కర్నూలు-గుంటూరు(కేజీ) రోడ్డులో సంతమాగులూరు మండల పరిధిలో పాతమాగులూరు, సంతమాగులూరు, పుట్టావారిపాలెం, వెల్లలచెరువు, కామేపల్లి ల వద్ద ఏర్పాటు చేసినట్లు సంతమాగులూరు సీఐ వెంకట్రావు తెలిపారు. నామ్ రోడ్డులో కూడా త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదే సమయంలో వాహనచోదకులకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

ప్రజల సహకారంతోనే నేర నియంత్రణ

సీఐ సుబ్బారావు



ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, ప్రజలు

చీరాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సహకారంతోనే నేరనియంత్రణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ అనుమానితుల వివరాలు స్థానిక స్టేషన్‌లకు అందించాలని వన్‌టౌన్ సీఐ సుబ్బారావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ ఆధ్వర్యంలో ఆదివారం రన్‌ఫర్ చీరాల నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజా ప్రతినిధులు, స్థానికులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణపై ఉపన్యసించారు. అలాగే మహిళా, శిశు సంరక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు దోగుపర్తి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీఎన్‌జీవో సంఘ ఎన్నికలకు నామినేషన్లు


సమావేశమైన ఏపీఎన్‌జీవో సంఘం నాయకులు

అద్దంకి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఏపీఎన్‌జీవో సంఘం అద్దంకి తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నికకు సంబంధించి సోమవారం నామినేషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఆదివారం స్థానిక కార్యాలయంలో నేతలు సమావేశమయ్యారు. మొత్తం 16 పదవులకు సంబంధించి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్లను తీసుకోనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న సభ్యులు నామినేషన్లు దాఖలు చేయాలని కోరారు. ఎన్నిక 15న జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో బైకు నుంచి పడిన మహిళ

● స్పందించి వైద్యశాలకు పంపిన పోలీసులు

అద్దంకి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌పై వెనుక కూర్చొని వెళ్తున్న మహిళ ఫిట్స్ వచ్చి ఆదివారం ఉదయం నామ్‌రోడ్డులో పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో పడిపోయింది. హైవేమొబైల్ వాహనంలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది వెంటనే స్పందించి ఆటోలో వైద్యశాలకు పంపించారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

అద్దంకి,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిలభారత 18వ మహాసభలు డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి సీహెచ్ మజుందర్ అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలశాఖ అధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, పి. తిరుపతిరెడ్డి, శారద, ఉసురుపాటి శామ్యూల్, రావులపల్లి కోటేశ్వరరావు, మున్నంగి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోశాల షెడ్ నిర్మాణానికి విరాళం


గోశాల షెడ్ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

అద్దంకి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి) : శింగరకొండ సమీపంలో హరిహర గోశాల షెడ్ నిర్మాణానికి అద్దంకికి చెందిన చిలకల సాంబశివరావు ఆదివారం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు, అలహరిప్రసాద్, తమ్మన శ్రీనివాసరావు, ఊటుకూరు రామకోటేశ్వరరావు, పువ్వాడ రామకోటేశ్వరరావు, చుండూరి మురళీసుధాకరరావు, సంకా బాబు, మహ్మద్‌రఫీ, నరశింహరావు, నాగయ్య, గోశాల నిర్వహకుడు సుబ్బారావు పాల్గొన్నారు.

కాకినాడలో రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కాకినాడులోని జేఎన్‌టీయూలో ఈనెల 21నుంచి 23వతేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు జేవీవీ నాయకుడు ఏవీ.పుల్లారావు తెలిపారు. ఆదివారం ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఈమేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఏర్పడిన జేవీవీ గత 35 ఏళ్ళుగా తెలుగు విద్యార్థుల కోసం ప్రతిఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.జయప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించిన టీంలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు యు.వెంకట్రావు, జి.శ్రీనివాసరెడ్డి, వి.మాలకొండారెడ్డి, కె.సుబ్రహ్మణ్యం, ఎస్‌వీ.రంగారెడ్డి, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
సోమవారం 8 డిసెంబరు 2025



తిరుపతిలో కలపొద్దని అర్ధనగ్న ప్రదర్శన

కలువాయి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న కలువాయి మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపొద్దని ఆదివారం కూడా ఆ ప్రాంత వాసులు ఆందోళనలు కొనసాగించారు. బస్టాండులో నిరసనకారులు అర్ధనగ్నంగా బైఠాయించారు. సేవ్ కలువాయి అంటూ నినాదాలు చేశారు. వారికి మద్దతుగా ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా, మంగళవారం నుంచి రిలే నిరాహార దీక్షలకు సిద్ధమవుతున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా మంత్రులు ఆనం, నారాయణలను కలిసి తమ బాధ చెప్పుకునేందుకు సిద్ధమవుతున్నారు. కలెక్టర్‌ను కలిసి జిల్లా మార్పుపై వినతి పత్రం అందజేయనున్నట్లు తెలియజేశారు.

విభజన మంటలు

- తిరుపతిలోకి వెళ్లనున్న కండలేరు జలాశయం
- రెండు జిల్లాల సాగునీటి రంగంపై తీవ్ర ప్రభావం
- పాలన తిరుపతిలో.. హక్కులు నెల్లూరులో..
- సోమశిల నీటి విడుదలలోనూ అభ్యంతరాలు
- భవిష్యత్‌లో వివాదాలు తలెత్తే ప్రమాదం
- 2022లోనే నివేదించిన అప్పటి కలెక్టర్

జిల్లా విభజనతో ఇప్పటికే ఒకసారి తీవ్ర నిరాశకు గురైన జిల్లా ప్రజానీకం.. ప్రభుత్వ తాజానిర్ణయంతో మరోసారి కంగుతిన్నారు. నెల్లూరు జిల్లాలో కలపండి అంటూ కోరిన గూడూరు ప్రజలను విన్నపాన్ని పక్కన పెట్టడం ఒక ఎత్తయితే.. అసలు ఎవరూ కోరకపోయినా.... రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలోకి విలీనం చేయాలంటూ ప్రాథమికంగా నిర్ణయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో కండలేరు జలాశయం తిరుపతి జిల్లాలోకి వెళ్లనుందన్న వార్త రైతాంగాన్ని తీవ్ర కలవరపాటుకు గురిచేస్తోంది. భవిష్యత్‌లో ఎదురయ్యే ఇబ్బందులను తలచుకొని ఆందోళన చెందుతున్నారు.



కలువాయి మండలాన్ని తిరుపతిలో కలపొద్దంటూ ఆదివారం అర్ధనగ్నంగా ఆందోళన చేస్తున్న ప్రజలు

నెల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం రాపూరు మండలంలో ఉన్నప్పటికీ దాని కింద లోయర్ రైపేరియన్ హక్కులు మనుబోలు, పొదలకూరు మండలాలకు ఉన్నాయి. ఈ రెండు మండలాలకు తాగు, సాగునీటి అవసరాలకు మొదట ప్రాధాన్యతను ఇచ్చి, మిగిలిన నీటిని తిరుపతి జిల్లాకు తీసుకెళ్లాల్సి ఉంది. ఈ మండలాల పరిధిలో సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటి వరకూ కండలేరు నెల్లూరులోనే ఉండడంతో ఎప్పుడూ ఇబ్బందులు తలెత్తలేదు. ఆ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేషన్ మొత్తం జిల్లా అధికారుల చేతుల్లో ఉండేది కాబట్టి అవసరాన్ని బట్టి నీటి విడుదల చేసుకునే వీలు కలిగేది. అదే ఇప్పుడు తిరుపతి జిల్లా అధికారుల చేతుల్లోకి పాలన వెళ్లాక పరిస్థితులు ఎలా ఉంటాయోనని రైతాంగం భయపడుతోంది. అలానే కలువాయి మండల రైతాంగం ఆందోళన కూడా ఇదే మాదిరిగా ఉంది. సోమశిల దక్షిణ కాలువ కింద కలువాయి మండలంలో సాగు జరుగుతుంటుంది. ఇప్పుడు మండల పాలన తిరుపతిలోకి వెళ్లి, సాగునీటి పంపిణీ నెల్లూరు జిల్లాలో ఉంటే భవిష్యత్ ఇబ్బందులు ఎలా ఉంటాయోనని తలుచుకొని భయపడుతున్నారు.

● పాఠం నేర్పిస్తున్న గత అనుభవాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశలోనే ఒకే జిల్లాలో 146 టీఎంసీలు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగిన జలాశయాలు లేవు. సోమశిలలో 78 టీఎంసీలు, కండలేరులో 68 టీఎంసీలు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ఈ నీటితో ఉమ్మడి జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలే కాకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కూడా నీటిని అందిస్తూ వస్తున్నాయి. సోమశిల జలాశయానికి పెన్నా క్యాచ్‌మెంట్ ఉండగా, కండలేరుకు ప్రత్యేకంగా క్యాచ్‌మెంట్ లేదు. సోమశిల నీటి మీదనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం ఒకే జిల్లాలో ఉండడంతో రాజకీయ, అధికార, రైతాంగ వ్యవస్థల మధ్య ఎటువంటి ఇబ్బందులు లేకుండా కండలేరుకు నీటిని నింపుతూ వస్తున్నారు. అయితే కండలేరును వేరొక జిల్లాలోకి విలీనం చేశాక, ఇప్పుడున్న మాదిరిగానే భవిష్యత్‌లో కూడా నీటిని విడుదల చేసేందుకు వీలు కలుగుతుందా..? అన్నదే చర్చనీయాంశంగా మారింది. సోమశిలలో 35 టీఎంసీలు దాటగానే ఇప్పుడు కండలేరుకు నీటిని విడుదల చేస్తున్నారు. దీనిపై డెల్టా రైతాంగం గానీ రాజకీయ నాయకులు గానీ అభ్యంతరాలు చెప్పడం లేదు. అదే పక్క జిల్లాలోకి వెళ్లాక భవిష్యత్‌లో ఈ పరిస్థితిని జిల్లా రైతాంగం, రాజకీయ వ్యవస్థలు ఒప్పుకుంటాయా..? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ముందు జిల్లా అవసరాలకు తగ్గట్టుగా సోమశిలలో పూర్తిగా 78 టీఎంసీలు పెట్టాకనే కండలేరుకు విడుదల చేయండి.. అంటూ పట్టుబడితే కండలేరు మీద ఆధారపడ్డ ప్రాంతాల పరిస్థితేమిటన్న ఆందోళన మొదలైంది. గత అనుభవాలు దీనిని గుర్తు చేస్తున్నాయి. గతంలో కండలేరు జలాశయం నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు నీటిని తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని జిల్లా రైతాంగం, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. కండలేరు వద్ద ఆందోళనలు చేయడమేకాక చలో హైదరాబాద్ వంటి ఉద్యమాలు కూడా జరిగాయి. అప్పట్లో ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు జిల్లా హక్కుల కోసం ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొనడం గమనార్హం. ఆ తర్వాత ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంది. ఇదే తరహా ఉద్యమాలు భవిష్యత్‌లో సోమశిల జలాల కోసం జరిగితే పరిస్థితేమిటన్న ప్రశ్నతలెత్తుతోంది.



కండలేరు జలాశయం

గతంలోనే నివేదించిన కలెక్టర్

2022లో జిల్లాల విభజన సమయంలో తొలుత వెంకటగిరి నియోజకవర్గం మొత్తాన్ని తిరుపతి జిల్లాలోకి కలిపేందుకు నిర్ణయించారు. ఈ నిర్ణయంపై అప్పట్లోనే కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. తమను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలంటూ డిమాండ్లు వెల్లువెత్తాయి. ఈ అంశంపై నాటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిలు ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితులను నివేదించారు. కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల ప్రజల ఆకాంక్షలను తెలియజేస్తూనే, ఇరిగేషన్ పరంగా ఈ మూడు మండలాలకు నెల్లూరుతో ఉన్న సంబంధాలను నివేదించారు. కండలేరు జలాశయం అన్నది నెల్లూరు జిల్లాలో ఉంటేనే నెల్లూరు, తిరుపతి జిల్లాలకు మేలు జరుగుతుందని నాటి కలెక్టర్ ప్రభుత్వానికి స్పష్టంగా వివరించారు. ఈ నివేదికలతో ఏకీభవించిన అప్పటి వైసీపీ ప్రభుత్వం కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరులోనే కొనసాగించింది. అయితే ఇప్పుడు అనూహ్యంగా ప్రభుత్వం ఆ మూడు మండలాలను తిరుపతిలోకి వీలనం చేయాలని ప్రాథమికంగా నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది.

సోమశిలకు తగ్గిన వరద

అనంతసాగరం డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శనివారం 22,676 క్యూసెక్కులు వస్తుండగా ఆదివారానికి 16,852 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. జలాశయంలో 73.555 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 12,650, కండలేరుకు 2,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కండలేరులో 60.28 టీఎంసీల నీటి నిల్వ

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 60.28 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1750 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 1490 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెళ్తుందని అధికారులు పేర్కొన్నారు.



పలేటివారిపాలెం మండలం పోకూరులో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

విజృంభిస్తున్న జ్వరాలు

- కందుకూరు ప్రాంతంలో ప్రబలిన డెంగ్యూ, స్క్రబ్‌టైఫస్
- మంచం పడుతున్న ప్రజలు
- అధ్వానంగా పారిశుధ్యం
- పట్టించుకోని అధికారులు

కందుకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంతంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పట్టణంతోపాటు గ్రామాల్లోనూ విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.జ్వరం వస్తే వాంతులు, విరేచనాలు, ఎడతెగని తలనొప్పి, కీళ్లనొప్పులతో బాధితులు మంచం పడుతున్నారు. అంతేకాక డెంగ్యూ పాజిటివ్, స్క్రబ్‌టైఫస్ పాజిటివ్ కేసులు కూడా నమోదవుతున్నాయి. దీంతో ప్రైవేటు ఆసుపత్రులు జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. జ్వరం వస్తే రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చయిపోతోందని బాధితులు భయాందోళన చెందుతున్నారు.

● ప్రతీ ఇంటిలో జ్వరపీడితులే...



కందుకూరులోని అనేక ప్రాంతాల్లో జ్వరపీడితులు అధికసంఖ్యలో ఉండగా, గ్రామాల్లోనూ ఇంటికి ఐదారుగురికి తక్కువ కాకుండా జ్వరాలతో మంచం పట్టారు. వలేటివారిపాలెం మండలం నేకునాంపురంలో ఇద్దరికి డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో వారు పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. జ్వర పీడితుల్లో అధికంగా డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదవుతు న్నాయి. అడపాదడపా స్క్రబ్‌టైఫస్ పాజిటివ్ కేసులు కూడా వస్తున్నాయని ఓ ప్రైవేటు వైద్యుడు తెలిపారు. ఇప్పుడిప్పుడే వర్షాలు తెరపిచ్చినందున డెంగ్యూ పాజిటివ్ కేసులు మరింత పెరిగే అవకాశం ఉంది. ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్న నేపథ్యంలో సీజనల్‌వ్యాధులు, జ్వరాలు ప్రబలుతుండడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

● దోమలతో బెంబేలు

కందుకూరులోని శివారు ప్రాంతాలతోపాటు గ్రామాల్లోనూ పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి వర్షపునీరు నిల్వ ఉండటంతో అక్కడ డెంగ్యూ దోమలు వృద్ధి చెందుతున్నాయి. డ్రైనేజీలు శుభ్రం చేయకపోతుండటంతో అవి దోమల వృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయి. అనేక గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు కూడా చేపట్టలేదు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లిన పాపానపోలేదు. వైద్యులు, వైద్యసిబ్బంది తమకేమీ పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు ఆర్‌ఎంపీలు, ప్రైవేటు వైద్యులపై ఆధారపడి వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, దోమల నిర్మూలన కార్యక్రమాలు గ్రామగ్రామాన అమలయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్క్రబ్ టైఫస్ అనుమానంతో మహిళ మృతి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత కాశీపాళెంకి చెందిన ఓ మహిళ అనుమానిత స్క్రబ్‌టైఫస్ వ్యాధితో మృతి చెందినట్లు ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. 32 ఏళ్ల వయసున్న మహిళకు జ్వరం రాగా, గత నెల 27న నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి స్క్రబ్‌టైఫస్(పాజిటివ్)గా నిర్ధారించి వైద్యసేవలందించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఈనెల 2న మృతి చెందినట్లు మృతురాలి సోదరుడు తెలిపారు. తన సోదరి అంత్యక్రియలు జరిగిన పక్కరోజున నెల్లూరు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఫోన్ చేసి, ఆ మహిళకు ఎలా ఉందని అడిగారని, చనిపోయిందని చెప్పగా ఫోన్ కట్ చేశారని ఆయన తెలిపారు. ఈ విషయంపై బుచ్చి అర్బన్ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ కుమార్‌ను వివరణ కోరగా తమ పరిధిలో స్క్రబ్ టైఫస్ వ్యాధికి సంబంధించిన సమాచారమే లేదని, అయినా విచారిస్తామని చెప్పారు.

నేటి నుంచి పీజీ స్పాట్ అడ్మిషన్లు

వెంకటాచలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని వివిధ పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి సోమవారం(నేటి) నుంచి స్పాట్ అడ్మిషన్లను ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ అర్హత ఉన్న విద్యార్థులు నేరుగా స్పాట్ అడ్మిషన్లలో పాల్గొని, సీటు పొందవచ్చన్నారు. ఈనెల 10 వరకు స్పాట్ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద ఉన్న ప్రధాన క్యాంపస్‌తోపాటు, కావలిలోని పీజీ సెంటర్‌లో కూడా ప్రత్యేక అడ్మిషన్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులు తమ వెంట అన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తప్పక తీసుకురావాలని తెలిపారు.

78 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ఉలవపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం నెల్లూరు విజిలెన్స్ సీఐ నరసింహరావు పట్టుకున్నారు. విజిలెన్స్ అధికారుల కథనం మేరకు వివరాలు... కనిగిరి నుంచి మహేంద్ర వాహనంలో ఉలవపాడు మీదుగా కావలి వైపు బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం అధికారులకు అందింది. దీంతో చాగొల్లు వద్ద కాపుకాచి వాహనాన్ని, డ్రైవర్ కార్తీక్‌ను అదుపులోకి తీసుకుని ఉలవపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 78 బస్తాల్లో ఉన్న 3,900 కిలోల పీడీఎస్ రైస్ విలువ రూ. 1,87,200గా అంచనా వేశారు. కిషోర్ అనే వక్తి బియ్యం కొనుగోలుదారుడు కాగా, కనిగిరికి చెందిన హజరత్తయ్య మధ్యవర్తి అని అధికారులు తెలిపారు. స్థానిక వీఆర్‌వో సమక్షంలో 6ఏ కేసు నమోదు చేసి పట్టుబడిన బియ్యాన్ని కందుకూరు ఎంఎల్‌సీ పాయింట్‌కు తరలించారు. ఖాళీ వాహనాన్ని తిరిగి ఉలవపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు విజిలెన్స్ పోలీసులు పేర్కొన్నారు.



అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం

రౌడీషీటర్ల పరార్

- జైలు నుంచి బయటకు రాగానే అజ్ఞాతంలోకి..
- పోలీసుల ఎదుట హాజరు కాని వైనం
- కీలక వ్యక్తుల కోసం గాలింపు
- రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం
- యాక్టివ్ నేరగాళ్లపై రౌడీషీట్లు తెరవాలని ఆదేశం
- పదే పదే నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు

నెల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి వరకూ కొందరి అండతో శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన రౌడీషీటర్లు ప్రస్తుతం జిల్లా నుంచి పరార్ అవుతున్నారు. ప్రభుత్వం రౌడీయిజంపై దృష్టి పెట్టడం, పోలీసులు రౌడీలపై ఉక్కుపాదం మోపుతుండడంతో వారిలో భయం పట్టుకుంది. ప్రధాన రౌడీషీటర్లు ఒక్కొక్కరుగా పోలీసుల నీడ నుంచి తప్పించుకొని, ఇతర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. బెయిల్‌పై ఉన్న రౌడీషీటర్లు కూడా పోలీసుల ఎదుట హాజరుకాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నారు. వీరికి కొందరు ఐడీ పార్టీ సిబ్బంది సహకరిస్తున్నార్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇటీవల వరకూ జిల్లాలో ప్రధాన రౌడీషీటర్లుగా చలామణి అవుతూ అనేక హత్య కేసుల్లో నిందితులుగా ఉన్న కొందరు రౌడీషీటర్లను వేదాయపాలెం పోలీసులు లేడీ డాన్ కేసులో అరెస్టు చేశారు. భారీగా గంజాయి విక్రయాలు చేస్తుండడంతో వీరిని పట్టుకున్నారు. వీరిలో ఇద్దరు రౌడీషీటర్లు ఇటీవల హైకోర్టు నుంచి కండిషనల్ బెయిల్ తెచ్చుకున్నారు. బెయిల్‌పై విడుదలై వెంటనే ఆ ఇద్దరు రౌడీషీటర్లు జిల్లా నుంచి పరారయ్యారు. తొలుత పోలీసుల నీడలోనే వీరు ఉన్నప్పటికీ.. వీరిపై ఉన్న ఇతర కేసులను కూడా పోలీసులు బయటకు తీస్తుండడంతో భయపడ్డారు. ఈ క్రమంలో కుటుంబాలతో సహా అజ్ఞాతంలోకి వెళ్లినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. బెయిల్ కండిషన్స్ ప్రకారం వీరు పోలీసుల ఎదుట హాజరుకావాల్సి ఉన్నప్పటికీ కొన్ని రోజులుగా హాజరుకావడం లేదు. దీంతో ఈ ఇద్దరు రౌడీషీటర్ల కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. ఈ రౌడీషీటర్ల బెయిల్ రద్దుకు కోర్టులో పిటిషన్ వేసే అవకాశాలున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. అలానే మరికొంత మంది రౌడీషీటర్లు కూడా ప్రభుత్వ చర్యలతో కనిపించడం లేదు.



● నేరగాళ్లపై ఉక్కుపాదం

ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు జిల్లా.. గడిచిన కొన్నేళ్లుగా హత్యలు, హత్యాయత్నాలు, బెదిరింపులు, దౌర్జన్యాలతో అట్టుడికిపోతోంది. ముఖ్యంగా గంజాయి బ్యాచ్‌లు శ్రుతిమించి వ్యవహరిస్తుండడం, అమాయకులను నడిరోడ్డుపై చంపేస్తుండడం ప్రజలను తీవ్ర కలవరానికి గురిచేసింది. అదే సమయంలో రౌడీలు, సస్పెక్ట్ షీట్లు, నేర ప్రవృత్తి కలిగిన వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది. రౌడీలు, గంజాయి నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని పోలీసులకు దిశానిర్దేశం చేసింది. దీంతో పోలీసు యంత్రాంగం వేగంగా కదులుతోంది. రౌడీలు, నేరగాళ్ల కదలికలపై నిరంతర నిఘా పెట్టింది. వరుస పెట్టి రౌడీషీటర్లు, పాత నేరస్తులను అరెస్టు చేస్తోంది. అదుపుతప్పుతున్న శాంతిభద్రతలను దారిలోకి తెచ్చేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాలని పోలీసులు నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్ల వారీగా తరచూ నేరాలు, గొడవలకు పాల్పడుతున్న వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రౌడీషీట్లు ఉన్న వారి వివరాలను ఒక జాబితా, అలానే సస్పెక్ట్ షీట్లు, ఇటీవల ఎక్కువగా గొడవలు పడుతున్న వారి వివరాలతో మరో జాబితాను సిద్ధం చేస్తున్నారు. గత రెండేళ్లలో ఐదు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లపై పీడీ యాక్టును ప్రయోగించేందుకు నిర్ణయించారు. ఈ జాబితాలో సుమారు 30 మంది ఉన్నట్లు సమాచారం. ఆదివారం కూడా మరో రౌడీషీటర్‌పై పీడీ యాక్టు నమోదు చేయడం గమనార్హం. అలానే ఏడాదిలో మూడు కేసుల్లో ఉన్న నేరగాళ్లపై రౌడీషీట్లు తెరిచేందుకు సిద్ధమవుతూ వారిని కంట్రోల్ చేయాలని పోలీసులు భావిస్తున్నారు.

మామిడి కాసేనా..!?

- అధిక వర్షాలతో ఊటెక్కిన మామిడి చెట్లు
- పూత స్థానంలో చిగురించిన లేటలు
- కాపు నిలవడంపై ఆశలు వదిలేసుకున్న రైతులు
- తోటలు కొనేందుకు వెనుకడుగేస్తున్న కౌలుదారులు

పూతలు మరింత ఆలస్యం

ఉలవపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గత అక్టోబరు, నవంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలు మామిడికి శాపంగా మారాయి. ఇప్పటికి మామిడితోటల్లో వర్షపు నీరు నిలిచే ఉన్నాయి. భూమిలో తేమ శాతం అధికం కావడంతో మామిడి చెట్లు ఊటతేలాయని. పూతలు రావడం ఆలస్యం అవుతుందంటున్నారు. మామిడిలో సాధారణంగా ప్రతీ ఏడాది డిసెంబరు నుంచి జనవరి వరకు పూతలు వస్తూ ఉంటాయి. ఈ సీజన్‌లో పూచిన పూతలు మాత్రమే కాపును, దిగుబడిని నిర్ధారిస్తాయని రైతులు చెబుతుంటారు. డిసెంబరు వచ్చిందంటే మామిడి తోటల్లో కౌలు రైతులు క్షణం తీరక లేకుండా వేలకవేలు ఖరీదు చేసే మందులు పిచకారీ చేస్తు సేద్యం చేస్తుంటారు. అలాంటిది ఈ ఏడాది మామిడి తోటలు వెలవెలపోతున్నాయి.

● పూతల స్థానంలో లేటలు(చిగుళ్లు)

వర్షాలు పడకుండా ఉంటే ఈపాటికి మామిడి చెట్లు పూత దిమ్మెకాడలతో దర్శనమిచ్చేవి. డిసెంబరు చివరికల్లా పూతకాడు పూతలతో మల్లె చెట్లును తలపించేలా ఉండేవి. అలాంటిది భూమిలో నీటి శాతం అధికం కావడంతో మామిడి చెట్లు పూతలు వేయాల్సిన స్థానంలో చిగురులు వేస్తున్నాయి. అక్కడక్కడ పది చెట్లలో ఒక చెట్టు మాత్రమే పూతలకు సిద్ధంగా ఉంది. అన్నీ ఒక్కసారి పూతలకు వస్తేనే రైతు దుక్కి, మందుల సేద్యం చేసేందుకు సిద్ధపడతాడు. ఇప్పుడు లేటలు వేసినందున వాటి నుంచి పూతలు రావడానికి సుమారు మూడు నెలలు పడుతుదని రైతులు చెప్తున్నారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మార్చి నెల వరకు పూతలు వస్తూనే ఉంటాయని చెప్తున్నారు. ఆ సమయంలో వేసిన పూతలు నిలబడే అవకాశాలు తక్కువగా ఉంటాయని పిందెలు, కాయలు నిలబడవని, దీంతో రైతుకు నష్టం తప్పదని లెక్కలు వేస్తున్నారు.



మామిడి తోటలో చెట్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

● ముందుకు రాని కౌలు రైతులు..

మండలంలో సుమారు 4000 ఎకరాల్లో మామిడి సాగులో ఉంటే అందులో 80 శాతం కౌలు రైతులు స్వాధీనంలో ఉంటాయి. ఈపాటికి రూ.లక్షలు పెట్టి పోటీపోటీగా మామిడి తోటలు కౌలుకు తీసుకునే రైతులు ఆలోచనలో పడ్డారు. పూతలు ఆలస్యం కావడం, వచ్చిన పూతలు నిలుస్తాయో లేదో అని సందిగ్ధం వీటన్నిటిని బేరీజు వేసుకొని కౌలు రైతులు వెనకడుగు వేస్తున్నారు. మొత్తానికి ఈ ఏడాది మామిడి వ్యాపారానికి గడ్డుకాలమనే చెప్పొచ్చు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	294

కోడిగుడ్ల ధర (100): 670

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.12288
వెండి కిలో ధర	రూ. 183600
వెండి ఒక గ్రాము	రూ.188.60

బ్రాహ్మణ మహా సంఘం మందుల వితరణ

కావలి (టౌన్) డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగళరావు నగర్‌కు చెందిన పేద బ్రాహ్మణుడు బీ సుధాకర్ కుమారుడికి ఇటీవల గుండె శస్త్ర చికిత్స జరిగింది. దీంతో బ్రాహ్మణ మహా సంఘం రూ. 14 వేల విలువ చేసే మందులను ఆదివారం వితరణ చేసింది. సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్, ప్రాంతీయ కార్యదర్శులు ఏవీ చలపతిరావు, స్వయంకుల రవికుమార్ శర్మ సుధాకర్ నివాసానికి వెళ్ళి పరామర్శించారు. పేద బ్రాహ్మణులను ఆదుకోవడంలో సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

బీసీ కులగణన చేయాలి

కందుకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లకై ఆత్మాహుతి చేసుకున్న ఈశ్వరాచారి మృతికి సంతాపంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన కార్యక్రమంలో సురేష్‌బాబు మాట్లాడుతూ బీసీలంతా సంఘటితంగా పోరాటానికి సిద్ధం కావాలన్నారు. నిరసన కార్యక్రమంలో యర్రంశెట్టి ఆనంద్‌మోహన్, నత్తా రామారావు, కంకణాల చినబ్రహ్మయ్య, వీరేపల్లి రత్నాచారి, ఎం హరిబాబు, బొల్లోజుల బాలబ్రహ్మాచారి, చనమాల రామారావు, చిరంజీవి పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ, విశ్వబ్రాహ్మణసంఘం నాయకులు

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ తల్లి అనివేటి మండపం నిర్మాణానికి పట్టణానికి చెందిన మోదడుగు వెంకట నరసింహారావు, అనూరాధ దంపతులు వారి కుమారుడు వెంకటసాయిస్వరూప్, వెంకటలక్ష్మి అనూష దంపతులు ఆదివారం రూ. 25116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు పిడికిటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు మండల యూటీఎఫ్ కార్యవర్గం ఎంపిక

కందుకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో కందుకూరు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దామా కొండపనాయుడు, ప్రధాన కార్యదర్శిగా చిత్తూరు వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడిగా ముప్పూరి మాల్యాద్రి, సహాధ్యక్షుడుగా టి సరోజనమ్మ, చదలవాడ కోటేశ్వరరావు, కోశాధికారిగా ఎం వేణుగోపాలరెడ్డి, మరో ఎనిమిది మందిని జిల్లా కౌన్సిలర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



అధ్వానంగా వెంగయ్యగారిపాలెం రోడ్డు

కావలి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని వెంగయ్యగారిపాలెం రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయమైందని వాహనచోదకులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణం నుండి పాతూరు మీదుగా వెంగయ్యగారిపాలెం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికి అక్కడ నుండి జాతీయ రహదారి వరకు ఉన్న కిలో మీటర్ మేర రోడ్డు గుంతలు పడ్డాయి. దీంతో అల్లిగుంటపాలెం, కోనేటిపాలెం, మాతినవారిపాలెం, పెదదిన్నెపాలెం, మోర్లవారిపాలెం, సర్వాయపాలెం గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వెంగయ్యగారిపాలెం నుండి జాతీయ రహదారి వరకు రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యాప్రమాణాలు పెంపొందించాలి : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యాప్రమాణాలు పెంపొందించాలని కందకుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం కందుకూరులో జరిగిన యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉపాధ్యాయులకు అన్నింటా అవమానాలు, అగౌరవమే మిగిలాయన్నారు. దాచుకున్న సొమ్మును కూడా తీసుకోలేని పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్యా వ్యవస్థకు మంచి రోజులు వచ్చాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు బోధనా ప్రమాణాలు మెరుగుపడటంతో ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలు క్యూ కడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు, సీనియర్ కార్యకర్త ముప్పరాజు కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పొన్నగంటి వెంకటేశ్వర్లు, కందుకూరు యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామా కొండప నాయుడు, చిత్తూరు వెంకటేశ్వర్లు, గుడ్లూరు, వివిపాలెం, లింగసముద్రం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే నాగేశ్వరరావు

పందుల సంచారం .. వ్యాధుల భయం!

● ఆందోళనలో అంజయ్యనాయుడు కాలనీవాసులు

అల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అల్లూరు పట్టణ పరిధిలోని అంజయ్యనాయుడు కాలనీలో పందుల సంచారంతో స్థానికులు విసిగిపోతున్నారు. గత టీడీపీ హయాంలో కాలనీలో ఇళ్లస్థలాలు మంజూరు చేయడంతో అక్కడ ప్రజలు గృహాలు నిర్మించుకొని నివాసముంటున్నారు. అయితే డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో మురుగునీరు నివాసాల మధ్యనే నిల్వ ఉంటోంది. దీంతో నిత్యం ఇళ్ల ముందు పందుల సంచారం అధికమైందని, పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. పందుల బెడదను నివారించాలని స్థానిక నగర పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పందుల సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు వాపోతున్నారు.



అభిమానులకు అండగా ఉంటాం!

● ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు

దగదర్తి (బిట్రగుంట) డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాలేపాటి కుటుంబాన్ని అభిమానించేవారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడు తెలిపారు. దగదర్తి మండలం పెద్దపుత్తేడు పంచాయతీ మాజీ ఎంపీటీసీ తిరుపతమ్మ భర్త, టీడీపీ నేత బత్తల రవి అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండడంతో, ఆదివారం ఆయనను రవీంద్రనాయుడు పరామర్శించారు. బత్తలరవి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని కుటుంబసభ్యులకు ఆయన భరోసా అన్నారు.



బత్తల రవిని పరామర్శిస్తున్న రవీంద్రనాయుడు

మల్లికార్జున కుటుంబానికి చేయూతనిస్తాం!

● టీడీపీ కన్వీనర్ బిజ్జం క్రిష్ణారెడ్డి

కలిగిరి, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): కలిగిరి పంచాయతీ జిర్రావారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గోసాల మల్లికార్జున గత నెల 27న గ్రామంలోని చర్చి వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నెల్లూరు వైద్యశాలలో చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. మల్లికార్జున మృతదేహాన్ని స్వగ్రామమైన జిర్రావారిపాలెంకు ఆదివారం తీసుకువచ్చారు. టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం క్రిష్ణారెడ్డి, స్థానిక నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జిర్రా అంకిరెడ్డి, కొప్పోలు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న క్రిష్ణారెడ్డి తదితరులు

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా ఆశ్రమ కమిటీ సభ్యులు, గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రం, నూలుమాలలు సమర్పించారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు 12మంది ఎంపిక

ఉలవపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి జూడో పోటీల ఎంపిక ఆదివారం మండలంలోని కరేడు గ్రామంలో జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. 25 మంది క్రీడాకారులు పాల్గొన్న పోటీలలో 12 మందిని ఎంపిక చేసినట్లు ఆర్గనైజింగ్ సెక్రటరి మురళి తెలిపారు. వీరంతా కర్నూల్‌లో జరగబోవు రాష్ట్రస్థాయి జూడో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కావలి నుంచి పవిత్ర, కావ్యలు ఎంపిక కాగా, కొత్తసత్రం నుంచి ఏ సాయిఅక్షిత, బాలాజి, శ్రీను, అదే విధంగా వలేటివారిపాలెంకు చెందిన హైమా, లింగసముంద్రం నుంచి లోకేష్, కరేడు గ్రామం నుంచి సాగర్, కలిగిరి నుంచి సందీప్, జీ హర్షిణి, కందుకూరు నుంచి పీ జీవిత, రంగాపురం నుంచి ఎం అల్లూరయ్య, శివ ప్రసన్నకుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో ఉన్నారు.



ఎంపిక పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు కందుకూరు విద్యార్థి

కందుకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కందుకూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్కే. తాజుద్దీన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా 69వ అండర్ 17 హాకీ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టులో స్థానం సంపాదించాడు. కడప జిల్లా పులివెందులలో ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాకీ టోర్నమెంటులో పాల్గొననున్న సందర్భంగా ఆదివారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం యం నరసింహమూర్తి, ఎం రమణయ్య, స్టాఫ్ సెక్రటరీ చిత్తూరు వెంకటేశ్వర్లు తదితరులు తాజుద్దీన్‌ను, అతనికి శిక్షణ ఇచ్చిన పీడీలు ఉప్పుటూరి సుబ్రహ్మణ్యం, మెండా నరసింహంను అభినందించారు.



క్రీడాకారుడు తాజుద్దీన్‌తో టీచర్లు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

బిట్రగుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో సంఘకాపరి రెవ పాస్టర్ జీ శ్యామ్యూల్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు పుట్టుకకు చిహ్నంగా నక్షత్రాన్ని ఆలయ శిఖరంపై ఆరోహణ ప్రార్థనలతో ప్రారంభించారు. సీనియర్ సిటిజన్ కే. చిట్టెమ్మచే కేక్‌కట్ చేయించి సంఘస్తులకు పంచిపెట్టారు. అనంతరం రెవ పాస్టర్ పాడేటి శ్యాంసన్ నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఇనమడుగుకు చెందిన రెవ పాస్టర్ జే సుందర్‌రాజ్ క్రీస్తు పుట్టుక గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘకార్యదర్శి బీ. ఫిలిప్, సంఘస్తులు పాల్గొన్నారు.



రక్షణ గోడలు లేని వంతెన

● పొంచి ఉన్న ప్రమాదం



రెయిలింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న వంతెన

సంగం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీపీఆర్ (కావలి) కాలువ వంతెన రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. సంగం పంచాయతీకి అనుబంధ గ్రామమైన వెంకటేశ్వరపురం గ్రామానికి రాకపోకలు సాగించడంతోపాటు రైతులు, పశువులు పొలానికి వెళ్లేందుకు వంతెన నిర్మించారు. ఏక వరుసలో ఉన్న వంతెన రెయిలింగ్ శిథిలమై పూర్తిగా దెబ్బతింది. కాలువలో పది అడుగుల మేర నీటి ప్రవాహం ఉంటుంది. ద్విచక్ర వాహనదారులు ఈవంతెనపై బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. అదుపు తప్పితే గల్లంతే. అధికారులు, పాలకులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

బస్సు వేళల్లో మార్పు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ బస్సు సర్వీసు వేళల్లో ఆదివారం నుంచి మార్పు చేయడం జరిగింది. విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని పాఠశాల సమయానికి అనుకూలంగా బస్సు సర్వీసును కొనసాగించాలని కోరుతూ శనివారం ఉపాధ్యయులు, గ్రామస్థులు ఉదయగిరి డిపో మేనేజరు రమేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన ఆయన సమయంలో మార్పు చేసి సర్వీసును కొనసాగించ డంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

అనంతసాగరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విదార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంధపాలకుడు నారాయణరావు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరుగుతోందని, సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని, ఆ దిశగా తల్లిదండ్రులు విద్యార్థులను పోత్సహించాలని కోరారు.

నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగవరపమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



నాగవరపమ్మకు పూజలు చేస్తున్న అర్చకులు

విద్యారంగ సమస్యలపై సమష్టిగా పోరాడాలి : యూటీఎఫ్



ఉదయగిరి: మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చంద్రశేఖర్‌రెడ్డి



వరికుంటపాడు: ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ బాధ్యులు

ఉదయగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పట్ల, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలపై సమష్టిగా పోరాడాల్సిన అవసరముందని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కంభాల చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పాత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 12వ పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం మం డల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా అరవ సురేష్, షేక్ మహ్మద్‌హనీఫ్, గౌరవాధ్యక్షుడిగా షేక్ మున్నా, ట్రెజరర్‌గా ఉదయ్‌కుమార్‌లను ఎంపిక చేశారు. ఈసందర్భంగా నూతన కమిటీని యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించి అభినందనలు తెలిపారు. మహాసభలకు హాజరైన ఉపాధ్యాయులకు బ్యాగులు వితరణ చేసిన పుల్లాయపల్లి గ్రామానికి చెందిన కంభాల నరసింహారెడ్డికి సంఘ నాయకులు ప్రత్యేక కృత జ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎడమ తిరుపతయ్య, దస్తగిరిఅహ్మద్, రంతుజాని, నాగేశ్వరరెడ్డి, కప్పా వెంకటేశ్వర్లు, షేక్ ఖాదర్ బాషా, ఏడుకొండలు, ఫణిరాజ్, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

●**వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** ప్రభు త్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలరాఘవులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండల శాఖ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించిన జిల్లా కార్యదర్శి బాలరాఘవులు ఆధ్వర్యంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పీ మనోహర్, వీవీ సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా ఎల్ చలపతి, సీహెచ్ శ్యామల, కోశాధికారిగా డీ చంద్రమౌళి, జిల్లా కౌన్సిలర్లుగా ఆర్ నాగార్జున, షేక్ కరీముల్లా, జీ హజరత్, ఎల్‌వీ నారాయణ, కేవీ కాంతారావు, ఎస్ నిర్మల, మహిళా కన్వీనర్, కో కన్వీనర్లుగా ఆర్ భవానీ, కే భువనేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన బాధ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఉపాధ్యాయులకు బ్యాగు లు, భోజన వసతి కల్పించిన పెద్దిరెడ్డిపల్లి ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె రవీంద్రతో పాటు ఉపాధ్యాయులు ఎల్‌వీ నారాయణ, లక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్‌వీ నారా యణ, వీవీ సుబ్రమణ్యం, జిల్లా ప్రతినిధి ఆర్ నాగార్జున, జిల్లా కుటుంబ సంక్షేమశాఖ డెరెక్టర్ కరీముల్లా, ఎం సుబ్బారావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

●**మర్రిపాడు :** స్థానిక యూటీఎఫ్ భవనంలో ఆదివారం ఉపాధ్యాయ సంఘం నాయకులు యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భాస్కర్, అధ్యక్షుడిగా విజయ్ భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా కె సుధాకర్, కోశాధికారిగా అబ్దుల్ మునాఫ్, ఎఫ్‌డబ్ల్యూ కన్వీనర్‌గా వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు జిల్లా కార్యదర్శి మోహన్ ప్రసాద్, నాయబ్ అధ్యక్షత వహించారు. అనంతరం మండల యూటీఎఫ్ నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

మానవ సమస్యలకు పరిష్కారం చూపేదే భగవద్గీత



ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

వింజమూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరి సమస్యలకు పరిష్కార మార్గం చూపేదే భగవద్గీత అని గుంటూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ శరత్ అన్నారు. స్థానిక శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆత్మజ్ఞానాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈనెల 9వ తేదీ నుంచి పిరమిడ్ నగర్‌లో పంచ మహాయజ్ఞం జరుగుతుందని అందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హేమలత, రాజేశ్వరి, ఉమా, నాగలక్ష్మీ, సుజాత, ఆదిలక్ష్మీ, లక్ష్మీ, జయప్రద తదితరులు పాల్గొన్నారు.

నల్లపురెడ్డిపల్లి రోడ్డుకు మహర్దశ

●రోడ్డు నిర్మాణానికి రూ. 5 కోట్ల మంజూరు



గుంతలమయంగా ఉన్న నల్లపరెడ్డిపల్లి రోడ్డు

ఆత్మకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లపరెడ్డిపల్లి రహదారికి మహర్దశ పట్టనుంది. దశాబ్ద కాలంగా అడుగడుగునా గోతులు, ఎక్కడకక్కడ కోతకు గురైన తారురోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డిపల్లి మీదుగా మురగళ్ళ, కనుపూరుపల్లి గ్రామాలకు ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. నిత్యం రాకపోకలు జరుగుతుండడంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే వెళ్లలేకపోతున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే వాహనదారులకు గుంతలు ఎక్కడున్నాయో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈక్రమంలో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు-బట్టేపాడు రోడ్డు నుంచి నల్లపురెడ్డిపల్లి, మురగళ్ల మీదుగా కనుపూరుపల్లి వరకు ఉన్న రోడ్డు నిర్మాణానికి రూ. 5 కోట్లు మంజూరు చేయించారు. టెండరు ప్రక్రియ అనంతరం రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి.

చెంచురామయ్య విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు వరప్రసాదినిగా మారిన గండిపాళెం జలాశయ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన అప్పటి శాసనసభ్యుడు పొన్నెబోయిన చెంచురామయ్య విగ్రహాన్ని జలాశయ ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సన్నాహాలు చేస్తున్నారు. ఆయన కుమారుడు మాజీ జడ్పీ ఛైర్మన్ చంచలబాబుయాదవ్ అభ్యర్థన మేరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జలాశయానికి అధికారికంగా పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయంగా నామకరణం చేసి జాతికి అంకితం చేసింది. అదే తరహాలో ప్రస్తుతం విగ్రహాన్ని సైతం త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు కాకర్ల ముందుకు రావడం అభినందనీయమని చంచలబాబుయాదవ్‌తో పాటు ఆయా మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా కమ్మవారిపాళెం రహదారి

● వాహనదారుల అవస్థలు



కమ్మవారిపాళెం వద్ద మోకాటిలోతు గుంతలతో ఉన్న రహదారి

దుత్తలూరు (ఉదయగిరి), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పంచాయతీలోని కమ్మవారిపాళెం-లక్ష్మీపురం గ్రామాల రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇటీవల రహదారికి మరమ్మతులు చేపట్టారన్నారు. అయితే పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి మొత్తం మోకాటిలోతు గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని, లేదంటే ఆందోళన చేపడతామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

సోమశిల రహదారిపై గుంతలు పూడ్చాలి

అనంతసాగరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమశిల రహదారిపై గుంతలు పూడ్చాలని పీకేపాడు రీచ్ నిర్వాహకులను స్థానిక టీడీపీ నాయకులు కోరారు. రీచ్ వద్దకు వెళ్లి వారితో ఆదివారం చర్చించారు. గుంతలు పూడ్చి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సోమశిల మాజీ సర్పంచు ఉప్పల విజయ్‌కుమార్, రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప మాలధారులు

ఉదయగిరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రాంతానికి చెందిన పలువురు అయ్యప్ప మాలధారులు ఆదివారం శబరిమలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక పార్వతీ పరమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టి గురుస్వాములచే ఇరుముడి కట్టించుకున్నారు. అనంతరం ఊరేగింపుగా ట్యాంక్‌బండ్ సర్కిల్‌కు చేరుకుని ప్రత్యేక వాహనాల్లో శబరిమలకు తరలివెళ్లారు.

చిన్నారులకు ఖురాన్ కంఠస్థ పోటీలు

ఉదయగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిలావర్ భాయ్‌వీధి మదరసాలో ఆదివారం యునైటెడ్ ఫోరం ఫర్ ఖురాన్ స్టడీస్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ముస్లిం చిన్నారులకు ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా మౌలానా సయ్యద్ అఫ్రోజ్, హాఫీజ్, షరీఫ్‌లు వ్యవహరించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంభం

అనంతసాగరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే, అనంతసాగరం మండల టీడీపీ పరిశీలకుడు కంభం విజయరామిరెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పలుగ్రామాల నాయకులు పాల్గొన్నారు.